శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త



# నితిన్ గడ్కరిని కలిసిన టీడీపీ జాతీయ ఉపాధ్యక్షులు బొల్లినేని వెంకటరామారావు



**వింజమూరు, జనవరి 3, ప్రభాతవార్త** కేంద్ర రోడ్డు రవాణా, జాతీయరహదారుల మంత్రి నితిన్ గడ్కరిని నూతన సంవత్సరం సందర్భంగా నాగపూర్ లోని ఆయన నివాసంలో తెలుగు దేశం జాతీయ ఉపాధ్యక్షులు ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకట రామారావు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన నియోజకవర్గంలోని అనేక రోడ్ల దుస్థితిని ఇంకా మెరుగ్గా చేసే విధంగా సహకరించాలని ఆయన కోరారు. బొల్లినేని అభ్యర్థనను సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

# ఫింఛన్ల సమస్యను పరిష్కరిస్తా



**నెల్లూరు, జనవరి 3, ప్రభాతవార్త-వైద్యం** ఫించన్ల సమస్యను త్వరలోనే పరిష్కరిస్తానని రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్, తెలుగుదేశం పార్టీ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్ అజీజ్ హామీ ఇచ్చారు. శుక్రవారం విజయవాడలోని వక్ఫ్‌బోర్డు కార్యాలయంలో జరిగిన 2 వ బోర్డు సమావేశం అనంతరం వక్ఫ్‌బోర్డు ఉద్యోగులు బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్‌ను కలిసి వారికున్న పింఛన్ సమస్య గురించి అబ్దుల్ అజీజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ గతంలో కరోనా సమయంలో విధి నిర్వహణలో వక్ఫ్‌ఉద్యోగి మృతి చెందారని, వారి మృతిపై ఎవరు స్పందించలేదని అన్నారు. గతంలో ఎవరు స్పందించని విధంగా షఫీవుల్ల మృతిపై మీరు స్పందించి లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియా ను ఇచ్చారని, మీ స్పందనతో మాకు ధైర్యం కలిగి స్ఫూర్తి వచ్చిందని ఉద్యోగులు అబ్దుల్‌అజీజ్‌కు తెలిపారు. ఉద్యోగుల మాటలకు స్పందించిన చైర్మన్ అబ్దుల్ అజీజ్ వారి పింఛన్ సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. వక్ఫ్‌బోర్డు ఆస్తుల పరిరక్షణ కోసం కష్టపడి పని చేయాలని ఆయన ఉద్యోగులకు సూచించారు.

# నేడు వన్ మ్యాన్ కమిషన్ రాకపై జిల్లా ఎస్సీలు తరలి రావాలి

## కొప్పాల రఘు



**నెల్లూరు కలెక్టరేట్, జనవరి 3, ప్రభాతవార్త** షెడ్యూల్ కులాల ఉప వర్గీకరణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన వన్ మ్యాన్ కమిషన్ చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా శనివారం నెల్లూరు పర్యటనకు వస్తున్న సందర్భంగా రేపు 4న ఉదయం 10:30 నుంచి జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నెల్లూరు కలెక్టరేట్ లోని తిక్కన ప్రాంగణంలో వన్ మ్యాన్ కమిషన్, చైర్మన్ అధికారులతో సమావేశమవుతారు. అనంతరం విజ్ఞప్తులు స్వీకరిస్తారు. ఈ విషయమై జిల్లాలో నలుమూలలా నివాసం కలిగిన ఎస్సీ పౌరులు, సంస్థలు, కుల సంఘాల ప్రతినిధులు, మహిళ సంఘాలు, అసోసియేషన్లు భారీగా తరలిరావాలని జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ ఎస్సీ, ఎస్టీ కమిటీ మాజీ సభ్యులు కొప్పాల రఘు పిలుపునిచ్చారు. ఈ మేరకు కొప్పాల రఘు మాట్లాడుతూ షెడ్యూల్ ఉప కులాల వర్గీకరణపై వన్ మ్యాన్ కమిషన్ చైర్మన్ దృష్టికి అభ్యంతరకర అంశాలపైనే విజ్ఞప్తులు చేయాలని తమ తమ అభిప్రాయాలను రాతపూర్వకంగా వ్రాసి అధికారులు ఏర్పాటు చేసిన కౌంటర్ల నందు రిజిస్ట్రేషన్ చేసుకున్న అనంతరం విజ్ఞప్తులు అందజేయాలని విజ్ఞప్తి చేశారు.

# కమిషనర్ ని కలిసిన కందుకూరు సబ్ కలెక్టర్



**నెల్లూరు కార్పొరేషన్, జనవరి 3, ప్రభాతవార్త :** నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్ సూర్య తేజను శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయంలోని కమిషనర్‌ఛాంబర్ నందు మర్యాద పూర్వకంగా కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ కలిశారు. పూలమొక్కను అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

# వంటేరు వరదారెడ్డి, తాయమ్మ మున్సిపల్ పార్క్‌కు పూర్వవైభవం తెస్తా

## కావలి మాజీ ఎమ్మెల్యే వేణుగోపాల్‌రెడ్డి



**కావలి, జనవరి 3 ప్రభాతవార్త** వంటేరు వరదారెడ్డి - తాయమ్మ మున్సిపల్‌పార్క్‌కు పూర్వవైభవం తెస్తానని కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణేగోపాల్‌రెడ్డి తెలిపారు. కావలి వెంగళరావునగర్‌లో స్వంత నిధులతో అన్ని వసతులతో సుందరమైన పార్క్‌ను ఏర్పాటుచేసి కావలి మున్సిపాలిటీకి అప్పజెప్పడం జరిగింది. మాజీ ఎమ్మెల్యే వంటేరు మున్సిపల్ కమీషనర్ శ్రావణ్‌కుమార్‌తో ఈ పార్క్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత 15 సంవత్సరాలనుండి ఇప్పటివరకు 5 దఫాలుగా పార్క్ అభివృద్ధికి కృషిచేశామన్నారు. పార్క్‌చుట్టూ ఉన్న ప్రహరీలకు పెయింట్స్, పిల్లలకు కావల్సిన ఆటవస్తువులు, పరికరాలను అందించడం జరిగిందన్నారు. గత ప్రభుత్వంలో కావలిలో ఉన్న ప్రజాప్రతినిధులు కక్షధోరణితో పార్క్‌కు తాళాలు వేయించడం జరిగిందన్నారు. అధ్వాన్నస్థితిలో ఉన్న పార్క్‌ను ఈ రోజు సాయంత్రం కావలి మున్సిపల్ కమీషనర్ శ్రావణ్‌కుమార్, మున్సిపల్ సిబ్బందితో పరిశీలించడం జరిగిందన్నారు. పార్క్‌ను అన్ని సదుపాయాలతో పూర్వవైభవం తెచ్చేందుకు తన స్వంతనిధులతో సహకరిస్తానని మాజీ ఎమ్మెల్యే వంటేరు కమీషనర్‌కు తెలిపారు.

# జిల్లా ఎస్పీ కృష్ణకాంత్‌ను సత్కరించిన మాజీ ఎమ్మెల్యే వంటేరు



**కావలి, జనవరి 3 ప్రభాతవార్త** శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరుజిల్లా ఎస్పీ కృష్ణకాంత్‌ను కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి కలిశారు. ఆయనను నెల్లూరులోని కార్యాలయంలో కలిసి ఘనంగా సత్కరించారు. పూలబొకే అందచేశారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియచేశారు. జిల్లా ఎస్పీ కృష్ణకాంత్‌తో మాజీ ఎమ్మెల్యే వంటేరు కొద్దిసేపు ముచ్చటించారు.

# ఇంచార్జ్ డిఎస్ఓగా అంకయ్య



**నెల్లూరు కలెక్టరేట్, జనవరి 3, ప్రభాతవార్త** జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఇన్చార్జిగా అంకయ్యను నియమించారు. ఇక్కడ డీ యస్ఓ గా పని చేస్తున్న వెంకటరమణ గత నెల 31వ తేదీన ఉద్యోగ విరమణ చేయడంతో ప్రస్తుతం డీఎస్ఓ కార్యాలయంలో ఏఎస్ఓగా విధులు నిర్వహిస్తున్న ఏఎస్ఓ అంకయ్యను ఇన్చార్జి డిఎస్ఓగా నియమించారు.

# సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం, జనవరి 3, ప్రభాతవార్త :** మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి శుక్రవారం సాయంత్రానికి 3238 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయంలో 71.813 టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్‌సికి 350, ఎన్ఎఫ్‌సికి 600, పెన్నా డెల్టాకు 1550, కండలేరు వరద కాలువకు800 క్యూసెక్కులు వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 99.735 మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

# శాస్త్ర సాంకేతిక పరిశోధనలతోనే దేశాభివృద్ధి

## విద్యార్థి దశనుండే సైన్స్ పై ఆశక్తి పెంపొందించాలి

## జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో జెడ్పీచైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ






**నెల్లూరు,జనవరి3 ప్రభాతవార్త-విద్య** శాస్త్ర సాంకేతిక పరిశోధనలతోనే దేశాభివృద్ధి సాధ్యమౌతుందని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని స్థానిక స్టోన్‌హౌస్ పేటలోని ఆర్ఎస్ఆర్ మున్సిపల్ ఉన్నతపాఠశాలలో జిల్లా విద్యాశాఖ,సమగ్రశిక్షల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి దక్షిణభారత విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని, జిల్లా విద్యాశాఖ అధికారి బాలాజీరావుతోకలిసి రిబ్బన్‌కట్ చేసి ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు విద్యార్థులు చిన్న తనం నుండే సైన్సు పై మక్కువ పెంచుకోవాలన్నారు. ఆలోచించే దోరణి అలవాటు చేసుకోవాలని సూచించారు. దేశాన్ని అగ్ర రాజ్యాల సరసన నిలపడానికి శాస్త్ర ప్రయోగాలే కీలకమన్నారు. నేడు మానవజాతి అనుభవిస్తున్న అత్యాధునిక సౌకర్యాలన్నీ శాస్త్ర సాంకేతిక పరిశోధనల నుండి వచ్చినవేనని కోనియాడారు.విద్యార్థినీ విద్యార్థులు అందరూ భావి,బారతశాస్త్రవేత్తలుగా మారేందుకు ఇటువంటి కార్యక్రమాల నిర్వహణ ఉపకరిస్తుందన్నారు. విద్యార్థులు కూడా ఇటువంటి అవకాశాలను చేజికించుకుని నూతన ఆవిష్కరణలను ఆవిష్కరించాలని పిలుపునిచ్చారు. ప్రకృతిలోని విషయాలను పరిశీలించటం, ప్రయోగాలు చేయటం, ఫలితాలు రాబట్టడం వంటి అంశాలపై విద్యార్థులు మక్కువ పెంచుకునేలా అద్యాపకులు శిక్షణ ఇవ్వాలన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి బాలాజీ రావు మాట్లాడుతు విద్యార్థులు సైన్స్‌పట్ల అవగాహన పెంచుకుని శాస్త్రవేత్తలుగా మారాలన్నారు.జిల్లా వ్యాప్తంగా 38 మండలాల నుండి 114 ప్రదర్శనలు విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఏర్పాటుచేశారన్నారు. వీటిలో అత్యుత్తమంగా నిలిచిన 6 నమూనాలను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయటం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం విజయంతం అయ్యేందుకు కృసిచేసిన అందరికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలను పరిశీలించారు. సమగ్రశిక్ష ఏపీసీ వెంకటసుబయ్య, జిల్లా సైన్స్ అధికారి కరుణాకర్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మధుసూదన్, విఎస్‌యూ యూనివర్సిటీ అద్యాపకులు సాయినాథ్, గోపీకృష్ణ, కార్పోరేటర్ కామాక్షిదేవి, డిప్యూటీ డిఈఓలు, ఎంఈఓలు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా ప్రారంభమైన ప్రపంచ తెలుగు సమాఖ్య సమావేశం

## సీఎం చంద్రబాబుని సన్మానించిన ప్రపంచ తెలుగు సమాఖ్య వైస్ ప్రెసిడెంట్, ఎంపీ వేమిరెడ్డి

## ప్రపంచ వ్యాప్తంగా తెలుగు మాట్లాడే సమాజాన్ని ఏకం చేసే దిశగా సమావేశాలు

**నెల్లూరు రూరల్, జనవరి 3, ప్రభాతవార్త** ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు మాట్లాడే సమాజాన్ని ఏకం చేయాలనే దృక్పథంతో నిర్వహిస్తున్న ప్రపంచ తెలుగు సమాఖ్య (డబ్ల్యూటిఎఫ్) 12వ ద్వైవార్షిక సమావేశాలు అట్టహాసంగా ప్రారంభం అయ్యాయి. హైదరాబాద్ లోని హైఐసీసీ వేదికగా శుక్రవారం ప్రారంభమైన ఈ సమావేశాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ప్రపంచ తెలుగు సమాఖ్య (డబ్ల్యూటిఎఫ్) సమావేశాలు 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు జరగనున్నాయి. తెలుగు సమాజాభ్యున్నతికి 1992లో ప్రపంచ తెలుగు సమాఖ్య ఏర్పాటు చేయబడింది. దీనికి నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి వైస్ ప్రెసిడెంట్‌గా వ్యవహరిస్తున్నారు. ముందుగా ప్రాంగణానికి చేరుకున్న సీఎం చంద్రబాబు నాయుడుకి జాగినీ ప్రెసిడెంట్ వి.ఎల్ ఇందిరా దత్, వైస్ ప్రెసిడెంట్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆత్మీయ స్వాగతం పలికారు. అనంతరం వేదికపై చేరుకున్నవారు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సమావేశాలను ప్రారంభించిన సీఎం చంద్రబాబుని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. అనంతరం ప్రెసిడెంట్ ఇందిరాదత్ ప్రారంభ ఉపన్యాసం చేశారు.



# పేదవారికి మెరుగైన వైద్యం అందించాలన్నదే తన లక్ష్యం..!

## కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి



**కావలి, జనవరి 3 ప్రభాతవార్త** కావలి ప్రభుత్వ వైద్యశాలలో పేదవారికి మెరుగైన వైద్యం అందించాలన్నదే తన లక్ష్యమని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం కావలి ఏరియా వైద్యశాలలో అడ్వైజరి కమిటి చైర్మన్ హోదాలో డాక్టర్లతో సమీక్ష నిర్వహించారు. వైద్యశాలలో అనేక సమస్యలు తన దృష్టికి వచ్చాయన్నారు. రోగులనుంచి ఎటువంటి ఫిర్యాదులు అందకూడదన్నారు. కార్పొరేట్ వైద్యం అందించి పేద రోగుల ప్రశంశలు అందుకోవాలన్నారు. రోగులపట్ల నిర్లక్ష్యం ప్రవర్తించవద్దన్నారు. ప్రభుత్వ వైద్యశాలలో మెరుగైన వసతులకు కృషిచేస్తామన్నారు. వైద్యశాలలో విద్యుత్, అంతర్గతరోడ్లు, అధునాతన పరికరాలు, తదితరవాటిపై చర్చించడం జరిగింది. యువ డాక్టర్లు సేవాధృక్పథంతో ఉండడం శుభపరిణామమన్నారు. వైద్యశాల ప్రాంగణంలో పార్కింగ్ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఏరియా వైద్యశాల షాపింగ్ కాంప్లెక్స్ నిధులు మౌలికవసతుల కల్పనకు వెచ్చిస్తామన్నారు. షాపింగ్ కాంప్లెక్స్ నిర్వహిస్తున్నవారు శనివారం సాయంత్రంకల్లా అద్దెబకాయిలు చెల్లించాలన్నారు. అలాకానిపక్షంలో షాపులు ఖాళీచేయిస్తామని ఎమ్మెల్యే దగుమాటి తెలిపారు. కావలి ఏరియా వైద్యశాలలో పూర్తిస్థాయిలో వైద్యశాల లక్ష్యాలను ఛేధించాలన్న ధ్యేయంతో ఎమ్మెల్యే దగుమాటి దాదాపు 7, 8 గంటలపాటు వైద్యశాలలో తిష్టవేశారు. కూలంకషంగా చర్చించారు. ఎమ్మెల్యే దగుమాటికి ఏరియా వైద్యశాల వైద్యులు, సిబ్బంది ఘనస్వాగతం పలికారు. పూలబొకేలు అందచేశారు. ఈ కార్యక్రమంలో వైద్యశాల సూపరిండెంట్ పద్మావతి, ఆర్ఎంఓ ప్రమీల, గౌరవ సలహాదారులు డాక్టర్ బెజవాడ రవికుమార్, అడ్వైజరి కమిటి సభ్యులు చవల రామకృష్ణ, ఆత్మకూరు నాగలక్ష్మి, జనసేన పట్టణ అధ్యక్షుడు పొబ్బ సాయివిఠల్, యేటూరి శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ వసతిగృహాల్లో మెనూ ప్రకారం భోజనం అందించాలి

**మర్రిపాడు, జనవరి 3,ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ వసతి గృహాలకు అందించిన మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని ఏకసభ్య కమీషన్ చైర్మెన్ , రిటైర్డ్ సీనియర్ ఐఎస్ అధికారి రాజీవ్‌రంజన్‌మిశ్రా కోరారు. ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం ఏకసభ్య కమీషన్‌ను ఏర్పాటు చేసి నెల్లూరు జిల్లాలో నెల్లూరు నగరంలో ఎస్సీ సామాజిక వర్గాల నుండి వినతులను స్వీకరించాలనే ఉద్దేశంతో ఆయన జిల్లా పర్యటనకు వచ్చారు. ఈసందర్భంగా మర్రిపాడు మండల కేంద్రంలోని ప్రభుత్వ వసతిగృహాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మర్రిపాడులోని సాంఘిక సంక్షేమ శాఖ బాలుర, బాలికల వసతిగృహాలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. ఈసందర్భంగా వసతిగృహ పరసరాలను , విద్యార్థులకు అందించే మెనూ వివరాలను విద్యార్థులను, సంక్షేమాధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వసతిగృహ విద్యార్థులకు కోట్లాది రూపాయల నిధులను మంజూరు చేస్తూ ప్రవేటు విద్యాసంస్థలకు ధీటుగా మెరుగైన ఉత్తీర్ణతా ఫలితాలను సాధించాలని అనేక చర్యలను తీసుకుంటుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న వసతులను, సదుపాయాలను వసతిగృహ విద్యార్థులు సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. బాలుర వసతిగృహంలోని విద్యార్థులతో స్టడీ ప్రోగ్రామ్ గురించి తెలుసుకొని పరిక్షా ఫలితాల్లో మెరుగైన ఫలితాలు సాధించాలని రంజన్‌మిశ్రా కోరారు. విద్యార్థులతో ఆయన ముఖాముఖి నిర్వహించి స్టడీ అవర్స్‌లో సందేహాలను నివృత్తి చేసుకోవాలని, ఇందుకు సంబంధించి విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. వసతిగృహాల్లో మెనూను తెలుసుకున్నారు. వసతిగృహ సంక్షేమాధికారులు వర్షాకాలం అయినందున పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని ఎప్పటికప్పుడు శానిటేషన్ చర్యలు చేపట్టి విద్యార్థుల ఆరోగ్యాలను పరిక్షించడానికి చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా లైజనింగ్ ఆఫీసర్ శ్రీనివాసులు, సాంఘిక సంక్షేమ శాఖ మర్రిపాడు బాలుర, బాలికల వసతిగృహ సంక్షేమాధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# సచివాలయ కార్యదర్శులు సమన్వయంతో విధులు నిర్వహించండి

## కమిషనర్ సూర్యతేజ



**నెల్లూరు కార్పొరేషన్, జనవరి 3, ప్రభాతవార్త :** నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని సచివాలయాల్లో విధుల నిర్వహణలో అన్ని విభాగాల కార్యదర్శులు సమన్వయంగా వ్యవహరించి ప్రజలకు మెరుగైన సేవలను అందించాలని కమిషనర్ సూర్య తేజ ఆదేశించారు. స్థానిక 52/1 ఇసుక డొంక, 52/2 గోపురం వీధి సచివాలయాలను కమిషనర్ శుక్రవారం తనిఖీ చేశారు. సచివాలయాలలోని రిజిస్టర్ లను తనిఖీ చేసే క్రమం తప్పకుండా రిజిస్టర్లలో వివరాలను ప్రతి ఒక్క కార్యదర్శి నమోదు చేయాలని ఆదేశించారు. అనంతరం కార్యదర్శులతో కమిషనర్ మాట్లాడుతూ సచివాలయాల పరిధిలోని టిడ్కో గృహ లబ్ధిదారులను గృహ ప్రవేశాలు జరిపేలా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. టిడ్కో గృహ సముదాయాలకు ప్రత్యేకంగా సచివాలయాలను కేటాయించి అక్కడి ప్రజలకు సంబంధించిన అన్ని పౌరసేవల కార్యక్రమాలను పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విధుల నిర్వహణపై ప్రతిరోజు సచివాలయంలోని అన్ని విభాగాల కార్యదర్శులు ముందస్తుగా సమావేశం ఏర్పాటు చేసుకొని కార్యనిర్వహణలో సమన్వయంతో పాల్గొనాలని కమిషనర్ ఆదేశించారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన శానిటరీ, ప్లానింగ్ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు ఇవ్వమని కమిషనర్ ఆదేసించారు. అనంతరం స్థానికంగా ఉన్న ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకును కమిషనర్ తనిఖీ చేసి నీటి నాణ్యతను,సరఫరాను పరిశీలించారు. సమీపంలో అనధికారికంగా నిర్మించినయున్న రేకుల షెడ్డు ను గమనించి తొలగించమని టౌన్ ప్లానింగ్ అధికారులను కమిషనర్ ఆదేశించారు.

# పర్వతరెడ్డికి శుభాకాంక్షల వెల్లువ



**నెల్లూరు రూరల్, జనవరి 3, ప్రభాతవార్త** నెల్లూరు నగర ఇంచార్జ్ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డికీ నూతన సంవత్సర తెలిపేందుకు వైఎస్ఆర్సిపి పార్టీ నాయకులు కార్యకర్తలు ఆయన అభిమానులు పెద్ద సంఖ్యలో ఆయన నివాసానికి చేరుకుని శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలో ఇంచార్జి బాధ్యతలు చేపట్టి నుండి నాయకులకు కార్యకర్తలకు భరోసా ఇస్తూ ముందుకు సాగుతున్న పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డిని అభిమానిస్తున్న వారందరూ ఆయన నివాసానికి చేరుకుని శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్ఆర్సిపి జిల్లా యువజన అధ్యక్షుడు కార్పొరేటర్ ఊటుకూరు నాగార్జున, మూడవ డివిజన్ వైఎస్ఆర్సిపి నాయకులు ధనుంజయ రామచంద్రయ్య 49 డివిజన్ నుండి సిద్ధిక్ ఆయన అనుచరులతో భారీ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. 46వ డివిజన్ కార్పొరేటర్ వేలూరు మహేష్ ఆధ్వర్యంలో ఆయనతో కలిపి డివిజన్ నాయకులతో కార్యకర్తలతో శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా మరికొందరు అభిమానులు ఆయన చిత్రపటాన్ని పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డికి బహుకరించారు. నగరంలో వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు ఆయన నివాసానికి చేరుకోవడంతో చంద్రశేఖర్ రెడ్డి నివాసం వద్ద సందడి వాతావరణం నెలకొంది.

## ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు



**చేజర్ల జనవరి 3 ప్రభాతవార్త :** చేజర్ల మండలం లోని ఆదూరుపల్లి ఉన్నత పాఠశాలలో మండల యుటిఎఫ్‌శాఖ ఆధ్వర్యంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్ర బాయిపూలే జయంతి వేడుకలు శుక్రవారం ఘన ంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిత్రిబాయి పూలే గురించి పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్ బాబు,యుటిఎప్‌నాయకులు,ఉపాధ్యాయులు ఆమె గొప్పతనాన్ని గురించి తెలియజేశారు. మహిళా విద్యకోసం ఆమె చేసిన కృషి మహిళలకు ఆమె అందించిన సేవలను వివరిచడం జరిగింది. నేటి బాలికలు ఆమెను స్పూర్తిగా తీసుకొని మరింత ఉన్నత స్ధాయికి ఎదగాలని కోరారు. ఈకార్యక్రమంలో మహిళా ఉపాధ్యాయులకు చిరు కానుకలు అందించారు. ఈకార్యక్రమంలో యుటిఎప్ నాయకులు రవిబాబు, రమణయ్య, ఏ సుబ్రమణ్యం,జి సుబ్రహ్మణ్యం, బుజ్జయ్య, శ్రీరాములు,పోలయ్య, షరీఫ్, శ్రీనివాసులురెడ్డి, సునీల్, విజయలక్ష్మీ, టిఎస్ కామాక్షి ఉపాధ్యాయని,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సావిత్రిబాయి పూలే జయంతి



**బిట్రగుంట జనవరి 3 ప్రభాతవార్త :** బోగోలు మండలం విశ్వనాధరావుపేట లోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల లో శుక్రవారం అక్షయ ఉమెన్ అసోసియేషన్ ఫర్ రూరల్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో పూలే సావిత్రి బాయి జన్మదిన వేడుకలు నిర్వహిం చారు.ఈ సందర్భ ంగా సావిత్రి పూలే బాయ్ చేసిన త్యాగాల గురించి, ఆమె మహిళలకు దళితులకు పాఠ శాల స్థాపన,ఆమె అనాధలకు వితంతువు ఆదుకునే వ్యక్తిత్వం గురించి అవార్డు ఆర్గనైజేషన్ నిర్వాహకులు జీవీ శైలజ వివరించారు.ఈకార్యక్రమం లో ముఖ్య అతిథిగా ప్రధానోపాధ్యాయులు రవీంద్రనాధ్ ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు.

## విజయానంద్‌కు అభినందనలు తెలిపిన వై.ఇ.ఎస్.అధ్యక్షులు



**కలువాయి జనవరి 3 ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ ఐ.ఎ.ఎస్‌ను యాదవ ఎంప్లాయిస్ సొసైటీ వ్యవస్ధాపకులు,రాష్ట్ర అధ్యక్షులు కలువాయి వాసి దామెనబోయిన వెంకటేశ్వర్లు యాదవ్, ఇతర జిల్లాల అధ్యక్షులు సభ్యులు శుక్రవారం అమరావతిలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించారు.

## టిడిపి శాశ్వత సభ్యత్వం తీసుకున్న జయంతుల నాయుడు



**చేజర్ల జనవరి 3 ప్రభాతవార్త :** తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా పెరమరల్లపాడు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు తలపన్నేని జయంతులునాయుడు తెలుగుదేశం పార్టీ శాశ్వత సభ్యత్వం శుక్రవారం తీసుకున్నారు.ఈ సందర్బంగా రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సూచన మేరకు శాశ్వత సభ్యత్వం తీసుకోవడం జరిగిందని అన్నారు. తెలుగుదేశం పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

## మల్లిఖార్జున్‌రెడ్డిని పరామర్శించిన సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



**నెల్లూరు, జనవరి 3, ప్రభాతవార్త-వైద్యం :** నగరంలోని బాలాజీ నగర్‌లో ఉన్న బాలాజీనగర్‌లో తెలుగుదేశం పార్టీ సీనియర్ కార్యకర్త, నాయకుడు కంచి మల్లిఖార్జునరెడ్డిని తెలుగుదేశం పార్టీ సీనియర్ కార్యకర్త, నాయకుడు కంచి మల్లిఖార్జునరెడ్డిని తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి, మాజీ శాసనమండలి సభ్యుడు, సర్వేపల్లి నియోజకవర్గ శాసనసభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి గురువారం మల్లిఖార్జునరెడ్డి నివాసంలో ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మల్లిఖార్జునరెడ్డి ఆరోగ్య పరిస్థితిపై వాకబు చేసి ధైర్యంగా ఉండాలని సోమిరెడ్డి సూచించారు. కార్యకర్తకు ఏ కష్టం వచ్చినా తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు.

## ఆర్ఎస్ఆర్‌లో ఘనంగా బాలికల దినోత్సవం



**బిట్రగుంట జనవరి 3 ప్రభాతవార్త:** బోగోలు మండలం కడనూతల గ్రామంలో గల రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం నాడు సావిత్రి బాయి పూలే జన్మదినాన్ని పురస్కరించుకొని "బాలికల దినోత్సవం"ఘనంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పివిఎన్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి నెల్లూరు అపోలో హాస్పిటల్లో పనిచేస్తున్న సీనియర్ గైనకాలజిస్ట్ అయిన డాక్టర్ పి స్రవంతి గారు ముఖ్య అతిథిగా పాల్గొన్నారని తెలిపారు. అతిధి డాక్టర్ పి స్రవంతి గారు మాట్లాడుతూ బాలికలకు, మహిళలకు వచ్చేటువంటి గైనకాలజీ సమస్యలను ఎలా గుర్తించాలి నివారణ చర్యలను విద్యార్థినులకు వివరించారు. అలాగే బాలికలకు మహిళలకు తరచూవచ్చు ఆరోగ్య సమస్యలు గుర్తించటం వాటిని నివారించుకోవటం చాలా సులభమని కంగారు పడాల్సిన అవసరం లేదని కొన్ని కొన్ని సమస్యలు సహజంగానే వస్తుంటాయని పోతుంటాయని అయితే నెగ్లెట్ చేయకూడదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏవో ఆర్ వి రమణారెడ్డి, ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ లక్ష్మీ, మహిళ అధ్యాపకులు, విద్యార్థులు, ఎన్ ఎస్ ఎస్ వాలంటరీస్ తదితరులు పాల్గొన్నారు.

## కూలీలకు ఉపాధి కల్పించాలి



**కోవూరు, జనవరి 3 ప్రభాతవార్త :** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీలకు సరైన వేతనం వారికి అందేలా సంబంధిత మండలాల్లోని ఎంపీడీవోలు, డ్వామా అధికార సిబ్బంది ప్రత్యేక చొరవ తీసుకోవాలని పంచాయ తీరాజ్ కమిషనర్ కృష్ణతేజ సూచించారు. శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోవూరులోని తహసీల్దార్ కార్యాలయంలో ఎంపీడీవో డ్వామా అధికార సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రమ శక్తి సంఘాలను మరలా ఏర్పాటు చేసేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. కూలీలకు ఈ పథకం కింద ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవడమే కాకుండా వారికి పనికి తగ్గ వేతనం కల్పించేలా తగు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా కాలువ గట్లపైన, పొలాల గట్లపైన మొక్కలు పెంచే కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. చేపట్టే పనులు పారదర్శకంగా ప్రభుత్వం నిర్దేశించిన నియమ నిబంధనలకు లోబడి సాగేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎంపీడీవోలు శ్రీహరిరెడ్డి, వెంకటేశ్వర్లు, డ్వామా ఏపీవో సుబ్బారావు, తదితరులు ఉన్నారు.

## నెల్లూరు మునిసిపల్ కార్పొరేషన్ లో ఇంజనీరింగ్ విభాగపు

## కార్మికులకు స్కిల్డ్,సెమిస్కిల్డ్ జీతాలు అమలు చేయాలి




**నెల్లూరు కార్పొరేషన్,జనవరి 3,ప్రభాత వార్త:** ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర పిలుపులో భాగం గా కార్పొరేషన్ కార్యాలయం ఎదుట శుక్రవారం నిరసన ధర్నా చేపట్టిన మున్సిపల్ కార్మికులు. అనంతరం నగర మేయర్ పొట్లూరి స్రవంతి కి వినతి పత్రం సమర్పించి, సమస్యల గురించి వివరించిచారు. ఈ సందర్భంగా నాయకులు కత్తి శ్రీనివాసులు,పెంచల నరసయ్య లుమాట్లా డుతూ ఆదాయం, అభివృద్ధి అనేవి ఉద్యోగులు కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా సాధ్యం కావు చెప్పారు. మునిసిపల్ కార్మికుల సమస్యల పట్ల మునిసిపల్ మంత్రి ప్రత్యేక దృష్టి సారించాలి కోరారు. వెంటనే మున్సిపల్ వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వర్కర్లు పాల్గొన్నారు.

## జాబ్‌మేళాలో 21మందికి ఉద్యోగాలు

**కావలిరూరల్, జనవరి 3 ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎంప్లాయిమెంట్ ఆఫీసు మరియు సీడాప్ సంయుక్తంగా సింహపురి యూనివర్సిటి కావలి పి.జి సెంటర్‌నందు శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ జాబ్‌మేళా కార్యక్రమంనందు మెడ్‌ప్లస్, యాక్ట్‌ఫైబర్‌నెట్ మరియు ఫ్లిప్‌కార్ట్ కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించడం జరిగింది. ఈ ఇంటర్వ్యూలలో 53మంది హాజరుకాగా 21మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరిగింది. ఈ జాబ్‌మేళాలో ఎంపికైనవారికి విక్రమసింహపురి యూనివర్సిటి పి.జి సెంటర్ ప్రిన్సిపాల్ టి.వీరారెడ్డి అభినందనలు తెలియచేశారు.

## కృష్ణపట్నం సర్పంచ్ చెక్ పవర్ రద్దు

**ముత్తుకూరు, జనవరి 3, ప్రభాతవార్త** ముత్తుకూరు మండలంలోని కృష్ణపట్నం సర్పంచ్ మోచర్ల వజ్రమ్మ చెక్ పవర్ మూడు నెలల పాటు రద్దు చేస్తూ జిల్లా పంచాయితీ అధికారి ఉత్తర్వులు జారీ చేశారు. మూడు నెలల కాలంలో పంచాయితీలో చెల్లింపులకు నిధులు డ్రా చేసేందుకు ముత్తుకూరు ఈఓపిఆర్‌డికి కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా పంచాయితీ అధికారులు తెలిపారు.

## దివ్యాంగుల్లో నైపుణ్యాన్ని గుర్తించాలి




**వెంకటాచలం,జనవరి 3,ప్రభాతవార్త:** దివ్యాంగుల్లో ఉన్న నైపుణ్యాన్ని గుర్తించి మరింత ప్రోత్సహిస్తే క్రీడల్లో రానిస్తారని దిశగా అధికా రులు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సూచించారు. సంయుక్త ప్రాంతీయ కేంద్రం సిఆర్‌సి నందు9వ వార్షికో త్సవ ఉత్సవాలకు సోమిరెడ్డి హాజరయ్యారు. ఆయన మాట్లా డుతూ పెద్దలు మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు చొరవతో కేంద్రానికి సంబంధించిన అనేక కంపెనీలు రావడం తద్వారా పేదలకు ఉపయోగపడే అనేక కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.జిందాల్ కంపెని దివ్యాంగుల కోసం నిర్వహించిన కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడ్డాయన్నారు.జిల్లాలోని దివ్యాంగులకు క్రీడా పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతి ప్రదానం చేశారు. దివ్యాంగులకు కావల్సిన పరికరాలు ఫిజియోథెరపి అన్ని రకాలుగా ఈ సంస్థ ద్వారా సద్వినియోగం చేసుకోవచ్చన్నారు.సి ఆర్ సి కి తమ వంతు సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.ప్రతి ఒక్కరూ దివ్యాంగుల పట్ల ప్రేమ అనురాగంతో పాటు తమ వంతు చేయూతన అందించాలన్నారు.ఈ కార్యక్రమంలో ప్రాంతీయ సంయుక్త డైరెక్టర్ మనోజ్ కుమార్ ఎస్పి,జిందాల్ కంపెని వెంకటసుబ్బయ్య అడిషనల్ ప్రాజెక్ట్ ఆఫీసర్ సిద్దా నాయక్,మెడికల్ సూపరిడెంట్ స్వప్న,హెచ్వోడి డ్రీం ఫౌండేషన్ మస్తాన్,వైస్ ప్రిన్సిపల్ ఏ ఎస్ ఆర్ మెడికల్ కాలేజ్ మరియు శిరీష తదితరులు పాల్గొన్నారు.

## కోన కాలువ తొట్టి శుభ్రం చేయిస్తున్న సర్పంచ్



**ఉదయగిరి, జనవరి 3, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉదయగిరి కోన కాలువ తొట్టిని శుక్రవారం సర్పంచ్ పాములూరి సామ్రాజ్యం , ఉప సర్పంచ్ ముత్తుజా హుస్సేన్, పంచాయతీ ఈవో కరిముల్లా ఆధ్వ్యంలో ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ కొండరాళ్ల మధ్యలో నుంచి వచ్చే జలపాతాన్ని ఉదయగిరి ప్రజలు దాహార్తిని తీరుస్తాయని అలాగే ఈ కొండలో వనమూలికలు ఉన్నాయని, ఈనీళ్ల సంజీవ్ లాంటి వని, ఉదయగిరి ప్రజలకు ఒక వరం లాంటిదని సర్పంచ్ కొనియాడారు. కొండమీద ఉన్న మంచినీళ్ల తొట్టిని శుభ్రం చేయడం జరిగింది, అలాగే కొండమీద నుండి కింద దర్గా వరకు కోన కాలువను శుభ్రం చేయడం జరిగింది.

## మంత్రిని కలిసిన విశ్వబ్రాహ్మణ సేవా సంఘం



**ఉదయగిరి, జనవరి 3, ప్రభాతవార్త :** విశ్వబ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని శుక్రవారం కలిసి పుష్పగుచ్చం అందించి సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా గౌరవ అధ్యక్షులు అల్లంపాటి వెంకట రమణయ్య చారి, జిల్లా అధ్యక్షులు అగర సుబ్రహ్మణ్యం ఆచారి, జిల్లా ప్రధాన కార్యదర్శి పేట విజయచారి, నగరఅధ్యక్షులు చెకచర్ల పిచ్చయ్య చారి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ పులికొండ చిన్న బ్రహ్మయ్య చారి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## ఘనంగా సాయిత్రిభాయి పూలే జయంతి



**కలువాయి జనవరి 3 ప్రభాతవార్త :** భారతదేశ మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయని సాయిత్రి భాయి పూలే జయంతి వేడుకలను శుక్రవారం స్ధానిక బి.వి.ఎన్.ఆర్ జడ్‌పి హైస్కూల్‌ప్లస్ నందు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కలువాయి సబ్‌బ్రాంచ్ ఛైర్మన్ జి.పెంచల పుల్లయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిత్రిభాయి పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాల లోని ఉపాధ్యాయినిలకు ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. మహిళల హక్కుల కోసం, సమానత్వం కోసం సాయిత్రిభాయి పూలే పాటు బడిన విధానాన్ని, పూల యొక్క గొప్పతనాన్ని ధైర్యాన్ని గురించి ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఎస్‌డి అబ్బాస్ అలీ తెలియజేశారు. ఈకార్యక్ర మంలో రెడ్ క్రాస్ వైస్ ఛైర్మన్ రాంబాబు ట్రెజరర్ మల్లికార్జున,ఉపాధ్యాయని,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## దేశం గర్వించే నాయకురాలు సావిత్రి బాయి పూలే




**వెంకటాచలం,జనవరి 3,ప్రభాతవార్త:** దేశం గర్వించే దగ్గ నాయకురాలు సావిత్రి బాయి పూలే అని సమాజ హితం కోసం వెనుకబడిన తరగతులు అభ్యునత కోసం అనేక కార్యక్రమాలకు రూపకల్పన చేశారని విక్రమసింహపురి విశ్వ విద్యాలయ ఉప కులపతి ఆచార్య ఎస్ విజయభాస్కర్ రావు పేర్కొన్నారు.శుక్రవారం వియస్ యులో సావిత్రి బాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ముందుగా ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి నివాళుల ర్పించారు అనంతరం విసి మాట్లాడుతూ బాల్య వివాహాలు వ్యతిరేకంగా పోరాటపడమే కాకుండా బాలికల విద్య కోసం మరియు మహిళల అభ్యున్నత కోసం పాటుపడినటువంటి వ్యక్తి అని కొనియాడారు.వచ్చే ఏడాది నుంచి సావిత్రి బాయి పూలే జయంతి పురస్కరించుకొని సమాజాభివృద్ధి కోసం నిరంతరం కృషి చేసేటువంటి మహిళలను గుర్తించి సావిత్రిబాయి పూలే పేరు మీద కొన్ని అవార్డులను ప్రధానం చేస్తామని తెలియజేశారు. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత మాట్లాడుతూ మహిళలు సావిత్రిబాయి పూలే ని ఆదర్శంగా తీసుకొని వివిధ రంగాల్లో రాణించగలగాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సిహెచ్ విజయ గారు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఎస్.ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఉదయ శంకర్ అల్లం ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ బి. వి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

## విద్యుత్ చార్జీల ప్రతిపాదనలపై బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ

## కావలి ట్రాన్‌కో ఈ.ఈ కెయస్ బెనర్జీ



**కావలి, జనవరి03 ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ దక్షిణప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ 2025-2026 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి విద్యుత్ చార్జీల ప్రతిపాదనలపై ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నట్లు కావలి ట్రాన్‌కో ఈ.ఈ కెయస్ బెనర్జీ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. ఈ నెల 7, 8, 10 తేదీలలో ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి బహిరంగ అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. ఈ ఏడాది జనవరి 7, 8 తేదీల్లో విజయవాడలోని 'ఏ' కన్వెన్షన్ సెంటర్‌లోనూ 10వ తేదీ కర్నూలులోని రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి కార్యాలయంలో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ మూడు రోజుల్లో ఉదయం 10:30 గంటలకు, మధ్యాహ్నం 1 గంటకు పై ప్రదేశంలో నేరుగాను, తర్వాత మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటలవరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వినియోగదారులు తమ సూచనలను, అభ్యంతరాలను తెలియచేయవచ్చునన్నారు. ఏపిఈఆర్‌సి ఛైర్మన్ (ఇన్‌చార్జి) ఠాగూర్ రామ్‌సింగ్ ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు. అభ్యంతరాలను సమీపంలోని విద్యుత్ డివిజన్ కార్యాలయంనుంచి పాల్గొని టారిఫ్ ప్రతిపాదనలపై సూచనలు, అభ్యంతరాలు, అభిప్రాయాలను తెలియచేయవచ్చునన్నారు. టారిఫ్ ప్రతిపాదనలు, అభిప్రాయాలను తెలియచేయపర్చుటకు ముందుగా కావలి డివిజన్ ఆఫీస్ కమర్షియల్ ఏఈకి అర్జీ సమర్పించినా పై సూచనలు, అభ్యంతరాలు ఏపీఈఆర్‌సి వారికి పంపించి అర్జీదారుడు ఎప్పుడు హాజరుకావలెనో వారికి ఫోన్‌నెంబర్ ద్వారా తెలియచేస్తామన్నారు.

## మృతుని కుటుంబానికి టిడిపి నేత ఆర్థిక సాయం

**గోనుపల్లి(రాపూరు),జనవరి3ప్రభాతవార్త :** రాపూరు మండలంలోని గోనుపల్లి గ్రామంలోని అరుంధతీయ వాడలో మృతి చెందిన మందా గంగయ్య కుటుంబ సుభ్యులకు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు ఈగా రాజా రెడ్డి శుక్రవారం ఆర్థిక సాయం ఆందజేశారు. గ్రామానికి చెందిన నిరుపేద గంగయ్య మృతి చెందడంతో ఆయన కర్మకాండలకు సంభదించి వారి కుటుంబ సుభ్యులకు రాజా రెడ్డి రూ.5వేల నగదు సాయం ఆందజేశారు.

## పదోతరగతి మోడల్ టెస్టు పేపర్స్ విద్యార్థులకు పంపిణి



**చేజర్ల జనవరి 3 ప్రభాతవార్త** 2025 మార్చిలో జరగనున్న పదోవతరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరు అయే విద్యార్థులకు ఉపయోర్ధంగా ఏడు పేపర్లను ఐక్య ఉపాధ్యాయ పెడరేషన్ శాఖ ప్రచురించబడిన మోడల్ టెస్టు పేపర్లను శుక్రవారం విద్యార్థులను పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఎన్నారై గణపతిరెడ్డి ఆళ్వారుశెట్టి చెంచురత్నం జ్ఞాపకార్ధం వీరి సతీమణి రత్నమ్మ అందించిన ఆర్థిక సహాయంతో చేజర్ల మండలంలోని అన్ని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు అందజేయడం జరిగింది. దాదాపు 250 మంది విద్యార్థులకు 20,000 వేల రూపాయాల విలువ గల మెడల్ టెస్టు పేపర్స్‌ను యుటిఎప్‌శాఖ జిల్లా మండలనాయకులు ఎన్.రమణయ్య ,జి.సుబ్రమణ్యం, ఎం.రవిబాబు, ఆర్.వి కృష్ణారెడ్డి, ఎ.సుబ్రమణ్యం, ఎన్.బుజ్జయ్య ఆర్.పోలయ్య, యు.శ్రీరాములు, ఏ.రమేష్, బి.సునీల్‌కుమార్, ప్రసాద్‌రెడ్డి,ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు,హైమావతి,రమేష్, సరోజ్‌కుమార్ పాల్గొన్నారు.

## రబీ పంటల సాగుపై రైతులకు అవగాహన



**సైదాపురం, జనవరి 3, ప్రభాతవార్త :** మండలంలోని తుమ్మలతలుపూరు, ఊటుకూరు, సైదాపురం గ్రామాల్లో ఉన్న రైతు సేవా కేంద్రం పరిధిలోని రైతులకు రబీ పంటల సాగుపై మండల వ్యవసాయశాఖాధికారిణి హైమావతి ఆధ్వర్యంలో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ శాఖ అధికారిణి గీతాకుమారి శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా రైతులు వేసిన కేఎస్ఎం 1638, ఆర్ఎన్ఆర్ 15048 వరి రకాలను సందర్శించారు. వీటిలో 60 రోజులకు ముందస్తు ఎన్నులు రావడం జరిగిందని, సూర్యరశ్మి తక్కువగా ఉండటం, గాలిలో తేమ శాతం ఉండటం, ముందస్తుగానే వరి నాట్లు వేయడం వలన ఇలా ఎన్ను రావడం జరుగుతుందని వారు తెలిపారు. దీనికి సంబందించి వరి పైరుకు 30 కేజీలు యూరియా, 15 కేజీల పొటాష్‌ను వారం రోజుల తరువాత అందించాలని రైతులకు తెలియజేశారు. అలాగే జింక్ లోపంకు సంబందించి 2 గ్రాములు చీలేటెడ్ జింక్‌సల్ఫేట్‌ను ఒక లీటరు నీటితో కలిపి పిచికారి చేస్తే వాటిలో ఉన్న లోపాన్ని నివారించవచ్చని ఆమె రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త కిరణ్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయ సహాయకులు పచ్చా రాజశేఖర్, రేవతి, పుష్పలత, రైతులు పాల్గొన్నారు.

## సావిత్రిబాయి పూలే జన్మదిన వేడుకలు



**ఉదయగిరి, జనవరి 3, ప్రభాతవార్త** మండల పరిధిలోని బిజ్జంపల్లి గ్రామంలో అవాజ్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం సావిత్రిబాయి జయంతి వేడుకలు నిర్వహిం చారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. ఈ సందర్భంగా అవాజ్ కమిటీ సభ్యులు నాయబ్ రసూల్ మాట్లాడు తూ భారతదేశ మొదటి ఉపాధ్యాయురాలిగా చరిత్రలో నిలబడ్డారని అన్నారు. మహిళలు వంటింట్లోనే కాదు బోధనా రంగాల్లో కూడా మహిళలు రాణించవచ్చని, భారతదేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయులుగా సావిత్రబాయి పూలే నిరూపించారని అన్నారు. అలాగే తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడుతూ పిల్లలను ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాఠశాలలో చదివించి మంచి భవిష్యత్తును ఇవ్వాలని కోరారు. సావిత్రి బాయి పూలేను ఆదర్శంగా తీసుకొని మంచి చదువును అందించాలని తల్లిదండ్రులను కోరారు. అవాజ్ కమిటీ సభ్యులు నాయబ్ రసూల్, అన్వర్, ఫరీద్, భాషా బాలకృష్ణ, ఫరీద్,బి.నారాయణ, ఇండ్ల పోలయ్య, ఎండ్ల వెంకటమ్మ, కాకు వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## చాకలకొండ రాధాకృష్ణ ప్రభుత్వ ఉన్నత పాఠశాల నందు

## ఘనంగా జాతీయ మహిళా ఉపాధ్యాయునుల దినోత్సవం



**వింజమూరు, జనవరి 3, ప్రభాతవార్త :** వింజమూరు మండలంలోని రాధాకృష్ణ ప్రభుత్వ ఉన్నత పాఠశాల చాకలకొండ నందు జాతీయ మహిళా ఉపాధ్యాయునుల దినోత్సవం ఘనంగా నిర్వహించడం జరిగింది. ముందుగా ఉపాధ్యా యినీ, ఉపాధ్యాయులు సావిత్రిబాయి పూలే చిత్రపటానికి శ్రద్దాంజలి ఘటించి ఆమె సేవలను కొనియాడారు. మహిళల చదువుల పట్ల ఆమె చేసిన కృషిని గురించి ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు చక్కగా వివరించారు. కవిగా, రచయిత్రిగా ఉపాధ్యాయునిగా సంఘసంస్కర్తగా ఆమె చేసిన సేవలను కొనియాడారు. అందులో భాగంగా మహిళ్ళా ఉపాధ్యాయునులు అయినటువంటి ఏ.సుభాషిణి, పి.సీతామహాలక్ష్మీ, షేక్ షమీలబేగంలను ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయులు టి.సరేష్, లక్ష్మయ్య, మహేష్, శ్రీరాములు, వ్యాయామ ఉపాధ్యాయులు వెలుగోటి కృష్ణ, జూనియర్ అసిస్టెంట్ సూరా రామిరెడ్డి పాల్గొన్నారు.

## బెల్ట్ షాపు నిర్వాహకుడి అరెస్ట్

**నెల్లూరు క్రైమ్, జనవరి 3, ప్రభాతవార్త :** నెల్లూరు నగర పరిధిలోని వావిలేటిపాడు వద్ద అక్రమంగా మద్యం విక్రయిస్తున్న సయ్యద్ సుభాని అనే వ్యక్తిని నెల్లూరు ఎక్సయిస్ ఎస్పై ఎస్. ప్రభాకర్ రావు తన సిబ్బందితో కలిసి శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుండి 9 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

## చికిత్స పొందుతూ క్షతగాత్రురాలు మృతి

**నెల్లూరు క్రైమ్, జనవరి 3, ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతున్న మహిళ మృతి చెందారు. వివరాల్లోకి వెళితే.. కోవూరు స్టౌ బీడి కాలనీకి చెందిన లక్ష్మణ్‌సింగ్, చిడిబాయి(64)లు దంపతులు. వారు గతనెల 31వ తేది మందుల కోసం నెల్లూరు నగరానికి బైక్‌పై వచ్చారు. తిరిగి ఇంటికి వెళుతూ పెన్నా బ్యారేజ్ వద్ద స్పీడ్‌బ్రేకర్‌ల వద్ద బైక్ అదుపు తప్పింది. దీంతో చిడిబాయి రోడ్డుపైపడడంతో తలకు తీవ్రగాయమై జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి మృతి చెందింది. మృతురాలి కుమారుడు విజయ్ సింగ్ ఫిర్యాదు మేరకు నార్త్ ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు.

## టిడిపి శాశ్వత సభ్యత్వం తీసుకున్న నారా లోకేష్,

## ఆరోగ్య రక్ష కన్వీనర్ దాట్ల చక్రవర్ధన్ రెడ్డి



**నెల్లూరు రూరల్, జనవరి 3, ప్రభాతవార్త :** నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ తరపున శాశ్వత సభ్యత్వం తీసుకునే వారి సంఖ్య పెరుగుతోంది. నెల్లూరు రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి తెలుగుదేశం పార్టీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి బాటలోనే పలువురు పయనిస్తున్నారు. అందులో భాగంగా నేటి సాయంత్రం నారా లోకేష్ ఆరోగ్య రక్ష కన్వీనర్ దాట్ల చక్రవర్ధన్ రెడ్డి 1,00,000 (లక్ష రూపాయిలు) చెల్లించి తెలుగుదేశం పార్టీ శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. నెల్లూరు రూరల్ లో తెలుగుదేశం పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

## సామాజిక న్యాయంకోసం పోరాడిన మానవతామూర్తి పూలే

## ఎంపిడిఓ సిహెచ్ శ్రీదేవి



**కావలి, జనవరి 3 ప్రభాతవార్త :** సామాజిక న్యాయంకోసం పోరాడిన మానవతామూర్తి, భారతదేశంలో తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయిపూలే అని కావలి ఎంపిడిఓ సిహెచ్ శ్రీదేవి కొనియాడారు. కావలి ఇందిరానగర్ మున్సిపల్ పాఠశాలలో డాక్టర్ రామ్‌సెంటర్,విశ్వోదయ ఆధ్వర్యంలో శుక్రవారం జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సంద ర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎంపిడిఓ శ్రీదేవి ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడా రు. స్త్రీ విద్యకోసం పాటుపడిన మహిళా వైతాళికురాలని ఆమె వేగుచుక్కగా నిలిచిపోయారని కొనియాడారు. రామ్‌సెంటర్ డైరక్టర్ కూనం తాతిరెడ్డి మాట్లాడుతూ సావిత్రి బాయిపూలే సామాజిక రుగ్మతలపై, సాంఘీక దురాచారాలపై పోరాడిన సంఘసంస్కర్త అన్నారు. బాల్యవి వాహాలకు, సతీసహగమనాలకు వ్యతిరేకంగా తన భర్త జ్యోతిరావుపూలేతో కలిసి పోరాడిన వీరవనిత అని తెలిపారు. అనాధశరణాలయాలు, శిశుహత్యానిరోధ ఆశ్రమాలు, వితంతువులకు పునర్వివాహాలు చేయించిన ప్రేమమయి అని కొనియాడుతూ నివాళులర్పించారు. సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి మాట్లాడుతూ సావిత్రిబాయిపూలే సత్యశోధ్ క్‌సమాజ్ సంస్థను జ్యోతిరావుపూలేతో కలిసి నడిపారన్నారు. కులనిర్మూలనకు పాటుపడ్డారన్నారు. శూద్ర, దళిత, బహుజన, స్త్రీవిద్యకోసం పాటుపడిన మానవతామూర్తి అన్నారు. పూ నాలో ప్లేగువ్యాధి ప్రబలినపుడు ప్రజలకు వైద్యశిబిరాలద్వారా సేవలందిస్తూ ఆ క్రమంలోనే ఆమెకు కూడా ఆ వ్యాధిసోకి జీవితం చాలించిన త్యాగమయి సావిత్రిబాయిపూలే అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని సుగుణమ్మ, ఉపాధ్యాయులు చాముండేశ్వరి, కవిత, మరియమ్మ, అరుణ, సుమలత, అంగన్‌వాడి టీచర్ కళావతి, తదితరులు పాల్గొని పూలేకు నివాళులర్పించారు.

## ఘనంగా సావిత్రిబాయి పూలే జన్మదినోత్సవ వేడుకలు

**ఉలవపాడు, జనవరి 3, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉలవపాడులోని జీవీఎస్ఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సావిత్రిబాయి పూలే 194వ జన్మదినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ కే.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయులకు శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఉపాధ్యాయురాలుగా ప్రముఖ సంఘ సంస్కర్తగా అణగారిన జాతుల అభ్యున్నతకై అలుపెరగని పోరాటం చేసి మహిళా విద్యాభివృద్ధి కోసం ఎన్నో పాఠశాలలను తెరిచి మహిళలకు చదువు నేర్పించిన మొట్టమొదటి ఉపాధ్యాయురాలని తెలిపారు. ఈ సందర్భంగా జూనియర్ బైపీసీ విద్యార్థినీ సిరి సావిత్రిబాయి పూలే వస్త్రధారణ చేయడంతో ఆ విద్యార్థిని సిబ్బంది అందరూ అభినందించారు. అనంతరం అధ్యాపకులు గారపాటి గోపిచంద్ ప్రకాష్, జ్యోతి, రఫీ, గంగా భవాని, హనుమంతరావు, సుబ్బాచారి, శ్రీనివాసులు, సుభాషిణి, మాధవరెడ్డి, మల్లిఖార్జున, వెంకటేశ్వర్లు, సావిత్రిబాయి పూలే, జ్యోతిరావుపూలే బాలికల విద్య కోసం చేసిన సేవలను విద్యార్థినీ, విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సావిత్రిబాయిపూలేను నేటి బాలబాలికలు ఆదర్శంగా తీసుకోవాలి



**కావలి, జనవరి3 ప్రభాతవార్త :** సావిత్రిబా యిపూలేను నేటి బాలబాలికలు ఆదర్శంగా తీసుకుని సామాజిక స్పృహను పెంచుకోవాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. శుక్రవారం కలయిక విజ్ఞానకేంద్రం ఆధ్వర్యంలో కావలి పట్టణం రామ్మూర్తిపేట మున్సిపల్ పాఠశాలలో భారతదేశపు తొలి ఉపాధ్యాయిని సావిత్రి బాయి పూలే 195వ జయంతిని ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలయిక విజ్ఞానకేంద్రం కన్వీనర్ లావణ్య మాట్లాడుతూ అతిత్వరలో కలయిక కళ్యాణమండపంలో కలయిక విజ్ఞానకేంద్ర గ్రంధాలయం ప్రముఖులచేత ప్రారంభించబడుతుందని తెలిపారు. తమ వేదికద్వారా విద్యార్థులు నిర్దేశిత వేళల్లో పుస్తకాలు చదువుకోవచ్చునని తెలిపారు. సావిత్రిబాయిపూలే జయంతిని పాఠశాల విద్యార్థులతో కలిసి జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఆమె జీవితవిశేషాలను తెలియచేశారు. కార్యవర్గ సభ్యురాలు, విశ్రాంత ప్రధానోపాధ్యాయిని చాకలికొండ శారద మాట్లాడుతూ దేశస్వాతంత్ర్యానికి పూర్వం జ్యోతిరావుపూలేతో బాల్యవివాహం అయిన తర్వాత ఆయన ప్రోత్సాహంతో విద్యావంతురాలయ్యారన్నారు. నాడు నిరాదరణకు గురై, నిరక్షరాశ్యులైన బడుగు, బలహీనవర్గాలు, బాలికలకోసం అనేక పాఠశాలలను స్థాపించి మహిళా, బడుగు జనోద్ధరణకోసం సావిత్రిబాయిపూలే ఎంతో కృషిచేశారన్నారు. పూలే జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని గొప్పఆశయసాధన చేయాలని హరినారపరెడ్డి, సాయిరాంప్రసాద్‌తెలిపారు. ఈ వేడుకలు తమ పాఠశాలలో జరపడం ఎంతో తృప్తినిచ్చిందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కిషోర్ కృతజ్ఞతలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కిషోర్, రాజ్యలక్ష్మి, కార్యవర్గ సభ్యులు మాకినేని అరుణ, జి.రామ్‌ప్రసాద్, గాదంశెట్టి హరనాథ్, తదితరులు పాల్గొన్నారు.

## బుడమగుంట కాలనీలో కోడిపందేలపై రూరల్ పోలీసులు దాడులు

## 6400 నగదు పట్టివేత, 4 కోడిపుంజులు స్వాధీనం



**కావలి, జనవరి3 ప్రభాతవార్త :** కావలి రూరల్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ జి.రాజేశ్వరరావు ఆదేశాల మేరకు కావలి రూరల్ ఎస్ఐ తిరుమల రెడ్డి పోలీసుసిబ్బందితో శుక్రవారం కావలి మున్సిపాలిటి పరిధిలోని బుడమ గుంటకాలనీలో కోడిపందేలపై ఆకస్మికదాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 9 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారివద్ద ఉన్న 6400ల రూపాయల నగదు, 4 కోడిపుంజులను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా రూరల్ ఎస్ఐ తిరుమలరెడ్డి మాట్లాడుతూ ఎక్కడైనా గ్రామాల్లో పేకాట, కోడిపందేలు ఆడుతున్నట్లు, గంజాయి అమ్ముతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియచేయాలని తెలిపారు.

## జొన్నవాడకు బస్సును ప్రారంభించిన అమ్మవారి భక్తురాలు



**కావలి, జనవరి03 ప్రభాతవార్త :** జొన్నవాడ శ్రీకామాక్షితాయి అమ్మవారి సన్నిధికి బస్సును పున: ప్రారంభించడం ఎంతో సంతోషదాయకమని అమ్మ వారి భక్తురాలు బుడమగుంట శ్రీశ్రీశ్రీ కామాక్షితాయి సమేత మల్లికార్జునస్వామి దేవస్థాన నిర్మాణకర్త ద్రోణాదులక్ష్మి సంపూర్ణమ్మ తెలి పారు. శుక్రవారం కావలి ఆర్‌టిసి బస్టాండ్‌లో ఆర్‌టిసి మేనేజర్ రాపూరు శ్రీనివాసులు సమక్షంలో ఆమె బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రతి శుక్రవారం జొన్నవాడకు వెళ్లి అమ్మవారి దర్శనానంతరం దేవాలయంలోనే నిద్రచేయడం భక్తులకు ఆనవాయితీ అన్నారు. సరైన ఆదాయం రావడంలేదని ఆర్‌టిసి అధికారులు బస్సును రద్దుచేయడం జరిగిందన్నారు. భక్తులు పలు బస్సులుమారి ఆటోలను ఆశ్రయించి జొన్నవాడకు వెళుతున్నారని, ముఖ్యంగా పేద భక్తులు అనేక ఇబ్బందులకు లోనవుతున్నారని ఆమె వివరించారు. అయితే, మళ్లీ ఈ బస్సును పున:ప్రారంభించడం భక్తులందరికి ఎంతో ఆనందంగా ఉందన్నారు. డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు మాట్లాడుతూ ఏపియస్‌ఆర్‌టిసి జోనల్ ఛైర్మన్ సన్నపరెడ్డి సురేష్‌రెడ్డి, కావలి శాశనసభ్యులు దగుమాటి వెంకటకృష్ణారెడ్డిల ఆదేశాల మేరకు జొన్నవాడబస్సును పున:ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ బస్సు ప్రతి శుక్రవారం సాయంత్రం 6 గంటలకు కావలి ఆర్‌టిసినుండి బయలుదేరి అల్లూరు, కొడవలూరు, రాజుపాళెం, బుచ్చిరెడ్డిపాళెం గ్రామాలమీదుగా జొన్నవాడకు రాత్రి 8 గంటలకు చేరుతుందన్నారు. తిరిగి శనివారం ఉదయం 6 గంటలకు అక్కడ బయలుదేరి అదే మార్గంలో కావలికి చేరుతుందన్నారు. ఈ బస్సు భక్తులకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. భక్తులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ అసిస్టెంట్ మేనేజర్ కల్పన, కార్యాలయ అసిస్టెంట్ మేనేజర్ విజయకుమారి, ట్రాఫిక్ సూపరిండెంట్ ఎం.రామకృష్ణ, బస్‌స్టేషన్ మేనేజర్ రమేష్‌బాబు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ దాకారపు రవిప్రకాష్, సెక్యూరిటి అధికారి కెకె రావు, బిసి ఐక్యతాభవన్ అధ్యక్ష కార్యదర్శులు అద్దంకి ప్రభాకర్, చిన్ని వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మ హిళా ఉపాధ్యాయ దినోత్సవం



**కందుకూరు, జనవరి 3, ప్రభాతవార్త :** స్థానిక టీఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల(స్వయం ప్రతిపత్తి)లో జనవరి 3న మహిళా సాధికారిత విభాగం, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో భారత తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకొని మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా జరిపారు. కార్యక్ర మానికి అధ్యక్షత వహించిన ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ పి.రాజగోపాల్‌బాబు ప్రసంగిస్తూ మహిళల మధ్య కోసం, బాల్య వివాహాలకు వ్యతిరేకంగా, సామాజిక అణచివేతపై వ్యతిరేకంగా పోరాడిన సావిత్రిబాయి పూలే అందరికి ఆదర్శమని కీర్తించారు. కామర్స్ అధ్యాపకులు డాక్టర్ శ్రీనివాసరావు ప్రసంగిస్తూ సావిత్రిబాయి పూలే మహిళా విద్య కోసం పాటుపడిన విధానం, దేశంలోనే తొలి మహిళా పాఠశాల స్థాపనలో సావిత్రిబాయి పూలే ఎదుర్కొన్న సవాళ్లు, మహిళల పురోగతి కోసం కోసిన అలుపెరగని పోరాటాన్ని గుర్తు చేశారు. మహిళా సాధికారిత విభాగం అధ్యక్షురాలు షేక్ షహనాజ్ బేగం మాట్లాడుతూ స్త్రీ జనోద్ధరణ, మహిళాభ్యుదయం కోసం సావిత్రిబాయి పూలే చేసిన పోరాటం అజరామరం అని తెలియజేశారు. రాజనీతి శాస్త్ర అధ్యాపకులు నరేస్‌రాజా మాట్లాడుతూ నేటి మహిళలకు, యువతకుల సావిత్రిబాయి పూలే పోరాటాల ఆదర్శమని, ఆ పోరాట స్ఫూర్తితో విద్యార్థినులు ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రసాయన శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ పద్మావతి, ఫిజికల్ డైరక్టర్ కరుణ రత్నకుమార్, అధ్యాపకులు రామకృష్ణ, బాలు నాయక్, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## మెపాడు గ్రామంలో పొలంపిలుస్తోంది



**కందుకూరు, జనవరి 3, ప్రభాతవార్త :** మండలంలోని మోపాడు గ్రామంలో ఆప్ పొలం బడి మండల వ్యవసాయాదికారి వి.రాము ఆధ్వర్యంలో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొలం బడిలో రైతులకు సమగ్ర పంటల యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించి రైతులకు మంచి నాణ్యమైన అధిక దిగుబడులు పొందుటకు సలహాలు, సూచనలు ఇవ్వడమే దీని ఉద్దేశమన్నారు. అలాగే వరిలో నీటి యాజమాన్యం, సమగ్ర ఎరువుల యాజమాన్యం గురించి వివరించారు. ముఖ్య అతిధిగా విచ్చేసిన సహాయ వ్యవసాయ సంచాలకులు పి.అనసూయ మాట్లాడుతూ ప్రస్తుం వరి రకం కేఎన్ఎం 1638లో 30-40 రోజులలో వెన్ను వస్తుందని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. వీటి నివారణకు చేపట్టాల్సిన చర్యల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు ఈ.రమణయ్య, రైతులు పాల్గొన్నారు.

## స్మశాన వాటిక అభివృద్ధి కోసం వీపీజీ సుకుమార్ గుప్తా రూ.4,11,116 భారీ విరాళం



**కందుకూరు, జనవరి 3, ప్రభాతవార్త :** పట్టణంలో ప్రముఖ వీపీసీ జ్యువెలరీ షాపు యజమాని వేముల సుకుమార్ గుప్తా తన మంచి హృదయాన్ని మరొకసారి చాటుకున్నారు. తన మంచి మనసుతో ఎన్నో మంచి కార్యక్రమాలకి లక్షలాది రూపాయాలు విరాళంగా అందజేసే సుకుమార్ గుప్తా శుక్రవారం పోతురాజు మిట్ట దగ్గరలో ఉన్న హిందూ స్మశాన వాటిక అభివృద్ధి కొరకు రూ.4,11,116 లు విరాళం అందజేసి తన మంచి మనసుని మరొకసారి నిరూపించుకున్నారు. స్మశాన వాటికలో వర్షాకాలంలో కార్యక్రమాలు జరుపుకోవడానికి ఇబ్బందిగా ఉన్న తరుణంలో అక్కడకు కావాల్సిన వసతులకి, మృతి చెందిన వారిని ఖననం చేసేందుకు సంబంధించిన రూము కొరకు విరాళాన్ని అందజేశారు. ఈ విషయంపై శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు దృష్టికి తీసుకొని వెళ్ళగా ప్రభుత్వం తరుపున స్మశాన వాటిక అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. భారీ విరాళాన్ని అందజేసిన వీపీజీ సుకుమార్ గుప్తాను ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అభినందించారు. ఈ కార్యక్రమంలో సుకుమార్ గుప్తా కుటుంబ సభ్యులు తిరుమలరావు, పార్ధు, ఆర్యవైశ్య నాయకులు మురారి శెట్టి సుధీర్ కుమార్, గుర్రం అల్లూరయ్య, బొగ్గవరపు బాల నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## విజయలక్ష్మీ భౌతికకాయానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే



**లింగసముద్రం, జనవరి 3, ప్రభాతవార్త :** మండలంలోని ముత్యాలపాడు గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకుడు కాట్రగడ్డ వెంకటప్పనాయుడు భార్య విజయ శుక్రవారం మరణించారు. విషయం తెలుసుకున్న శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు వెంకటప్పనాయుడు ఇంటికి వెళ్లి విజయ పార్ధివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వెంకటప్పనాయుడుని పరామర్శించి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కొడాలి కోటేశ్వరరావు, వంకాయలపాటి మాల్యాద్రి, రామిశెట్టి మాలకొండయ్య, సర్పంచ్ దామ సీతారామయ్య, పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు.

## ఏపీఈఆర్‌సీ ప్రజాభిప్రాయ సేకరణ



**నెల్లూరు, జనవరి 3, ప్రభాతవార్త-వైద్యం :** ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి(ఏపీఈఆర్సీ) 2025 -26 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర విద్యుత్ సంస్థలు (ఏపీఎస్పీడీసీఎల్, ఏపీ సీపీడీసీఎల్, ఏపీఈపీడీసీఎల్) ప్రతిపాదించిన ప్రతిపాదించిన వార్షిక ఆదాయ అవసరాల నివేదికపై జనవరి 7వ నుంచి 8 వరకు విజయవాడలో 10వ తేదీ న కర్నూలు నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజాభిప్రయా సేకరణ చేపట్టనుందని జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ వి.విజయన్ తెలిపారు. శుక్రవారం నగరంలోని విద్యుత్ భవన్లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రజాభిప్రాయ సేకరణ ప్రతి రోజు ఉదయం 10గంటల 30 నిమిషాల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు తిరిగి మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4గంటల 30 నిమిషాల వరకు షెడ్యూల్ ప్రకారం ఏపీఆర్సీ వారు విచారిస్తారని తెలిపారు. జిల్లా ప్రజలు తమ అభిప్రాయాలు తెలుపుటకు జిల్లా విద్యుత్ శాఖ కేంద్రమైన విద్యుత్ భవన్ నందు, జిల్లాలోని అన్ని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయాల్లోనూ ఏర్పాట్లు పూర్తి చేసి ఉన్నామని తెలిపారు. నెల్లూరు టౌన్, నెల్లూరు రూరల్ డివిజన్‌లు విద్యుత్ భవన్‌లో జరుగుతాయని, కావలి, కోవూరు, ఆత్మకూరు డివిజన్‌లు వారి డివిజన్ కార్యాలయంలో జరుగుతాయని ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని విద్యుత్ టారిఫ్‌పై తమ అభిప్రాయాలు తెలపాలని ఎస్ఈ కోరారు. అభిప్రాయాలు తెలియపరచాలనుకునే వారు జనవరి 7,8వ తేదీల్లో విజయవాడలో 10వ తేదీ కర్నూలులో కానీ డైరెక్ట్‌గా పాల్గొని అభిప్రాయాలు తెలుపవచ్చని లేదా రిజిస్ట్రేషన్ చేసుకుని పాల్గొనవచ్చన్నారు. ఉదయం సెషన్‌లో డైరెక్ట్‌గా పాల్గొనే వారికి మాత్రమే అవకాశం ఉంటుందని, రిజిస్ట్రేషన్ చేసుకున్నవారికి మధ్యాహ్నం సెషన్‌లో అవకాశం కల్పిస్తున్నారని, డైరెక్ట్‌గా ప్రజాభిప్రాయ సేకరణ జరుగుచోట వచ్చిన వారికి కూడా సమయాన్ని బట్టి అవకాశం కల్పిస్తామని తెలిపారు.

## ఎఫ్‌ఆర్‌ఎస్ సకాలంలో నమోదు చేయాలి

**నెల్లూరు, జనవరి 3, ప్రభాతవార్త-వైద్యం :** సిబ్బంది, ల్యాబ్ టెక్నీషియన్లు ఎఫ్ఆర్ఎస్ హాజరుని సకాలంలో నమోదు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి వంగల సుజాత అన్నారు. శుక్రవారం నగరంలోని సంతపేటలో ఉన్న వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం సమావేశ మందిరంలో సుజాత, జిల్లా క్షయ లెప్రసీ , ఎయిడ్స్ కంట్రోల్ ఆఫీసర్ ఎస్‌కే ఖాదర్ వలి, జిల్లా మలేరియా అధికారి ఈ.హుస్సే నమ్మల ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాల ల్యాబ్ టెక్నీషియన్స్‌కి మాసాంతపు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ సమయపాలన ఖచ్చితంగా పాటించి విధులను సక్రమంగా నిర్వహించాలని, ఎఫ్ఆర్ఎస్‌లో నమోదు చేయని వారికి జీతాలు తగ్గించడం జరుగుతుందని ఆమె హెచ్చరించారు. ల్యాబ్ టెక్నీషియన్ లందరూ ల్యాబ్‌లో పరీక్షలను మంచిగా నిర్వహించి సరియైన ఫలితాలను అందజేయాల్సిందిగా తెలియజేశారు. అనంతరం డాక్టర్ ఎస్‌కే ఖాదర్ వలి మాట్లాడుతూ క్షయ వ్యాధికి సంబంధించిన కళ్లే పరీక్షలను తగిన ప్రమాణాలతో నిర్వహించి నిర్దేశిత లక్ష్యాలను సాధించాల్సిందిగాను అన్ని అనుమానిత క్షయ వ్యాధిగ్రస్తులను పరీక్షించి సరియైన ఫలితాలను అందించాలని, వాటికి సంబంధించిన వివరాలను యాప్స్‌లో పొందుపరచాలని తెలియజేశారు. మలేరియా యాక్టివ్, పాసివ్ రక్త పరీక్షల నమూనాలను నిర్దేశిత లక్ష్యాల ప్రకారం 100 శాతం పూర్తి చేయాల్సిందిగా తెలియజేశారు. ఈ సీజన్లో జ్వరపీడితులు ఎక్కువగా నమోదవుతున్న కారణంగా అందరికి సకాలంలో రక్త పరీక్షలను నిర్వహించి వాటి యొక్క సక్రమమైన ఫలితాలను అందించి మలేరియా, డెంగ్యూ వ్యాధుల ఫలితాలను తొందరగా గుర్తించి తగిన చికిత్స అందజేసి వ్యాధులు ప్రబలకుండా చేయుటకు దోహదపడాల్సిందిగా తెలియజేశారు. అలాగే వారాంతపు, మాసాంతపు రిపోర్టులను సకాలంలో జిల్లా కార్యాలయానికి అందజేయాలని సూచించారు. ఈ సమావేశానికి జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి ఉమామహేశ్వరి, జిల్లా గణాంక అధికారి సహన, జిల్లాలోని అందరూ ల్యాబ్ టెక్నీషియన్స్ క్షయ వ్యాధి నిర్మూలన, సిబ్బంది, సహాయ మలేరియా అధికారి వి.నాగార్జునరావు, మలేరియా నిర్మూలన కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సులు ముగింపు



**ఉదయగిరి, జనవరి 3, ప్రభాతవార్త :** ఉదయగిరి మండల పరిధిలోని గండిపాలెం పంచాయతీలో గండిపాలెం గ్రామం నందు శుక్రవారం అడుసుమల్లి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ గ్రామాలలో భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులను నిర్వహి స్తున్నట్లు తహశీల్దార్ ఎం.సుభద్ర తెలిపారు. భూ సమస్యలు ఉన్న పలువురు రైతుల నుండి అర్జీలను స్వీకరించారు. సత్వర పరిష్కారానికి సిబ్బందికి ఆదేశించారు. ఈ రెవెన్యూ సదస్సులు ఈ రోజుతో ముగిశాయని అన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఆర్ఐ సురేంద్ర, వీఆర్వో వెంకటేశ్వర్లు, గ్రామ ప్రజలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఉదయగిరి ఫొటో స్టూడియో యూనియన్ నూతన కార్యవర్గం ఎన్నిక



**ఉదయగిరి, జనవరి 3, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉదయగిరిలో శుక్రవారం స్థానికంగా ఉన్న ఫొటో స్టూడియో యూనియన్ కొత్త కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు. మరో సారి యూనియన్ ప్రెసిడెంట్‌గా ఓంకారం వెంకట ప్రసాద్ ఎన్నిక య్యారు. లేటెస్ట్ 4కే టెక్నాలజీని స్టూడియోల్లో ప్రవేశపెట్టి, కస్టమర్లకు అధునాతన ప్రింటింగ్, మిక్సింగ్ సేవలను అందించడమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ప్రెసిడెంట్ వెంకటప్రసాద్ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా టెక్నాలజీని ఉపయోగించుకుని స్టూడియోల పనితీరును మెరుగుపరుస్తాం, పట్టణంలోని అన్ని స్టూడియోల్లో ఒకే ధరలను అమలు చేయాలని నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. కార్యవర్గ సభ్యులు ప్రెసిడెంట్‌గా ఓంకారం వెంకట ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా పి.నారాయణరెడ్డి, ట్రెజరర్ పవన్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్‌గా అశోక్, సభ్యులుగా పవన్, ఆర్‌కే రఫీ, జిలాని, రమేష్, నాగేంద్ర, గౌరవ అధ్యక్షులుగా నారాయణ, కృష్ణమూర్తి, మిక్సింగ్ రఫీ, యూనియన్ సభ్యులంతా ఈ కార్యవర్గానికి సహకరించి స్టూడియోల అభివృద్ధి కసం కృషి చేయాలని నిర్ణయించారు.

## రీ సర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలి



**కోవూరు, జనవరి 3 ప్రభాతవార్త :** కోవూరు పంచాయతీ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ప్రస్తుతం భూముల రీ సర్వే జరుగుతుందని, దీనిని రైతులు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకో వాలని తహసీల్దార్ నిర్మలానందబాబా అన్నారు. కోవూరులోని గ్రామ పంచాయతీ ఆవరణలో శుక్రవారం గ్రామ రెవెన్యూ సదస్సుతో పాటు రీ సర్వే గ్రామ సభ కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ భూములకు సంబంధించి ఎటువంటి సమస్యలు ఉన్నా ఈ సదస్సు దృష్టికి ఒక అర్జీ రూపంలో తీసుకువస్తే వాటిని పరిష్కరించి రైతుకు తగు న్యాయం చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిదంగా ప్రస్తుతం రీ సర్వే కోవూరులో జరుగుతుందని రైతులు దీనిని పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వై. విజయ, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ మధుసూదన్‌రావు, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, మండల సర్వేయర్ రమేష్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, గ్రామ రెవెన్యూ అధికారులు ఉన్నారు.

## కోనలో వైభవంగా గోధా దేవి క్షేత్రోత్సవం



**పెంచలకోన(రాపూరు),జనవరి2ప్రభాతవార్త:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో ధనుర్మాస శుక్రవారం సందర్భంగా గోధా దేవి క్షేత్రోత్సవం వైభవంగా నిర్వహించారు. ఇందులో బాగంగా ఆదిలక్ష్మీ అమ్మవారికి గోధాదేవి అలంకారం నిర్వహించి ఉదయం తిరుప్పా వైనిర్వహించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూల అలంకరణ,పూజలు నిర్వహించారు. తదుపరి అమ్మవారిని పలు రకాలైన పుష్పాలతో గోధా దేవిగా ఆలంక రించి తిరుచ్చిపై వుంచి కోనలో గోధా దేవి క్షేత్రోత్సవం నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు అమ్మవా రినిదర్శించుకొని పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున వచ్చిన భక్తులకు కావలసిన బోజన,వసతి, దర్శనం ఏర్పాట్లను ఆలయ ఉప కమీషనర్ పోరెడ్డి శ్రీనివాసుల రెడ్డి, ఆలయ సీనియర్ సహాయకుడు పాలవల్లి లక్ష్మీ నారాయణ,పులగల నరసింహసిబ్బంది వెంకటసుబ్బయ్య,హరీష్ తదితరులు పర్యవేక్షించారు.స్వామి వారి పూజా,ఆలంకరణ కార్యక్రమాలను ఆలయ ప్రధానర్చకులు రామయ్య స్వామి, పెంచలయ్య స్వామి, అర్చక స్వాములు శశి స్వామి, మధు స్వామి, వర్ధన్ స్వామి, వినోద్ స్వామి, సాయి స్వామి, నాగరాజు స్వామి తదితరులు వేదమంత్రాలతో,శాస్త్రోక్తంగా నిర్వహించారు.

## విశ్వనాధరావుపేట లో గ్రామసభ



**బిట్రగుంట జనవరి 3 ప్రభాతవార్త :** బోగోలు మండలం విశ్వనాధరావుపేట లో శుక్రవారం గ్రామసభ జరిగింది. గ్రామసర్పంచ్ గండూరి మంజుల అధ్యక్షతన జరిగిన ఈ సభలో గ్రామాభివృద్ధి కి తీసుకోవలసిన చర్యలు, వివిధ అబి.వృద్ధి పనులపైన చర్చించారు. సమావేశంలో ఉపసర్పంచ్ పెండ్లి. వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి జాలయ్య వార్డ్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## కొండ బిట్రగుంట దేవస్థాన అభివృద్ధికి చర్యలు



**బిట్రగుంట జనవరి 3 ప్రభాతవార్త:** బోగోలు మండలం కొండ బిట్రగుంట లోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థాన అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు కావలి శాసనసభ్యుడు దగుమాటి వెంకట కృష్ణారెడ్డి చెప్పారు.కొండబిట్రగుంట శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. తొలత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి దేవస్థానం అర్చకుల ఆశీర్వాదలు పొందారు.అనంతరం దేవస్థానంలో నిర్మాణంలో ఉన్న పలు అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు తూర్పు రాజగోపాల నిర్మాణం, కోనేటి నిర్మాణం, ఇటీవల భూమి పూజ చేసిన మహాప్రకార నిర్మాణపు పనులతో పాటు గిరిప్రదక్షణ ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. కొండబిట్రగుంట దేవస్థానాన్ని అభివృద్ధి చేయడంతో పాటు దేవస్థాన ఆలయ పవిత్రతను కాపాడేందుకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలన్నదీ తన ముఖ్య ఉద్దేశం అన్నారు. దేవస్థానంలో వివాహాలు జరిపి పవిత్రత దెబ్బతినకుండా దేవస్థాన దిగువ భాగంలో కళ్యాణ మండపంనిర్మాణం చేపట్టి కల్యాణాలు నిర్వహించుకునేలా చేయాలన్నది తన ఆలోచనని తెలిపారు.ఆయన వెంట ఆలయ ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్ శ్రీరామ్ మాల్యాద్రి, ఆలయ ఈవో ఆరవ రాధాకృష్ణ, మండల టిడిపి కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు,మాజీ ఎంపీటీసీ చిలకపాటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## విధులను బహిష్కరించిన న్యాయవాదులు



**ఆత్మకూరు, జనవరి3,ప్రభాతవార్త:** అనంతపురం బార్ అసోసియేషన్‌కు చెందిన సీనియర్ న్యాయవాది శేషాద్రి మృతిపై సిట్టింగ్ జడ్జ్‌తో న్యాయ విచారణ జరిపించి ఆయన మృతికి కారణమైన అనంతపురం త్రీ టౌన్ సిఐ శాంతిలాల్‌ను వెంటనే ఉద్యోగం నుంచి డిస్మిస్ చేయాలని శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా ఆత్మకూరు న్యాయవాదులు డిమాండ్ చేశారు. శుక్రవారం న్యాయవాదులు విధులు బహిష్కరించి సిఐ శాంతిలాల్ చర్యకు వ్యతిరేకంగా కోట్టు గేటు ఎదుట నిరసన తెలిపారు. ఈసందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ సిరాజుద్దీన్ , న్యాయవాది వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఒక సివిల్ కేసు విషయంలో న్యాయవాది శేషాద్రిని శనివారం అనంతపురం త్రీటౌన్ సిఐ శాంతిలాల్ స్టేషన్‌కు పిలిపించి దండించినందుకు తీవ్ర మనస్థాపానికి గురైన శేషాద్రి సిఐ చాంబర్లోనే గుండెపోటుకు గురై మృతిచెందాడన్నారు. శేషాద్రి వెంట వెళ్ళిన జూనియర్ న్యాయవాదులను పోలీస్‌స్టేషన్‌లోకి అనుమతించకపోవడం శోచనీయమన్నారు. సివిల్ కేసులో జోక్యం చేసుకోవద్దంటూ సుప్రీంకోర్టు పదే పదే చెబుతున్నా సిఐ శాంతిలాల్ ఖాతరు చేయకపోవడం దారుణమన్నారు. న్యాయవాది మృతికి బాధ్యత వహిస్తూ ప్రభుత్వం వెంటనే వారి కుటుంబ సభ్యులకు కోటి రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అడ్వికేట్ సురేష్ మాట్లాడుతూ శేషాద్రి మృతిపై క్రిమినల్ కేసు నమోదు చేసి ప్రభుత్వం వెంటనే విచారణకు ఆదేశించి బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకోవాని కోరుతూ అనంతపురం న్యాయవాదులు ఉద్యమానికి మద్ధతుగా కోర్టు విధులు బహిష్కరించారు. ఈకార్యక్రమంలో న్యాయవాదులు కె.వి.శేషారెడ్డి, ఎల్.వి.రమణయ్య, నంద ఓబులేశు, హరికృష్ణ, తిరుపతమ్మ, రహమతున్నీసా , సురేష్, మల్లిఖార్జున , రసూల్ తదితరులు పాల్గొన్నారు.

## ఏకసభ్య కమీషన్‌కు మాదిగలు వినతి పత్రాలు ఆందజేయాలి

**రాపూరు,జనవరి3ప్రభాతవార్త :** ఏస్సీ వర్గీకరణకు సంబందించి రాష్ట ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమీషన్‌కు జిల్లాలోని మాదిగలు వర్గీకరణ నిమిత్తం వినతి పత్రాలు ఆందజేయాలని యం.ఇ.ఎఫ్ నాయకుడు బొజ్జా మల్లేశ్వర రావు ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.వర్గీకరణ నిమిత్తం నియమించిన కమిటీ ఛైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా శనివారం నెల్లూరుకు వస్తున్నందున మాదిగలు,మాదిగ ఉపకులాలు మేదావులు,విద్యావంతులు వర్గీకరణకు సంబందించి వినతి పత్రాలను ఆందజేయాలని, ప్రతి సచివాలయం పరిధిలో ప్రదర్శించిన ఎస్సీ జనాభా లిస్టులో మాదిగ కులాల వారు తమ కులం పేరు తప్పుగా వుంటే వాటిని సరిచేయించుకోవాలన్నారు.

## ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**కందుకూరు, జనవరి 3, ప్రభాతవార్త :** పట్టణంలోని స్థానికంగా ఉన్న దాచురి రామిరెడ్డి విజ్ఞాన కేంద్రం నందు కందుకూరు టౌన్‌లో వర్కర్స్ యూనియన్ సీఐటీయు విస్తృత సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సమావేశానికి టి.రాము అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో నెల్లూరు జిల్లా ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎంపీ రాజు మాట్లాడుతూ ఆటో కార్మికులు అనేక సమస్యలతోటి ఇబ్బంది పడుతున్నారని స్థానికంగా ఆటో స్టాండ్లు ట్రాఫిక్ సమస్య అధిక పెనాల్టీలు భారంగా మారాయని అన్నారు. ఈ సమావేశంలో నెల్లూరు జిల్లా ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కే.సురేష్ మాట్లాడుతూ డిగ్రీలు చదువుకొని ఉద్యోగాలు లేక అనేక మంది ఆటో రంగంలోకి వస్తున్నారని తెలిపారని, ఇవాళ స్వశక్తితో ప్రభుత్వంపై ఆధారపడకుండా ఉద్యోగాల కోసం రవాణా రంగంలో పని చేస్తూ జీవనం గడుపుతున్నారని వారికి అనుబంధంగా అనేక రంగాలు జీవనోపాధి కల్పిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం వైపు నుండి ఆటో కార్మికులకు సరైన సదుపాయాలు కలగడం లేదని అన్నారు. స్టాండ్లు చూపించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. అదే సందర్భంలో ఆటో కార్మికులు క్రమశిక్షణతో ఉండాలని బళ్ళు ఫిట్నెస్ లైసెన్స్ ఇన్సూరెన్స్ పక్కాగా ఉండాలని ప్రయాణికులతో మర్యాదగా మసులుకోవాలని ఆటో కార్మికులు ఐక్యంగా ఉండి సమస్యలు పరిష్కారం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈనెల 21వ తేదీ నెల్లూరు నగరంలో రవాణా రంగా కార్మికుల సదస్సు జరుగుతుందని ఈ సదస్సులో ఆలిండియా నాయకులు పాల్గొన్నారు. ఈ సదస్సుకు కందుకూరు పట్టణం నుండి ఆటో కార్మికులు హాజరు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం 11 మంది తోటి కందుకూరు టౌన్ ఆటో వర్కర్స్ యూనియన్ నూతన కమిటీ ఎన్నిక జరిగింది. ఈ కార్యక్రమంలో బి.నారాయణ, అనిల్, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే మాఊరి లిమిట్స్‌లో మద్యంషాపు ఏర్పాటు చేయొద్దని చెప్పండి కోదండరామపురం మహిళలు వేడుకోలు



**జలదంకి,జనవరి3,ప్రభాతవార్త:** అయ్యా ఎమ్మెల్యే మేమందరం మొన్న ఎన్నికల్లో మీకు ఓట్లేసినాము, మేము మీమను షలమే, మాకు మేలుచేస్తారని గంపెడాసెతో వున్నాముప్రస్తుతం మాపల్లెకు అనుకోని నష్టకార్యం చేపట్టేందుకు కొందరు వైన్‌షాపు యజమానులు ప్రయత్నాలు చేస్తున్నారు .మద్యంషాపు ఏర్పాటుకు గత రెండు రోజులనుంచి చర్యలు చేపడుతున్నారు.అదిమాకు ఎంతోనష్టం కలిగించే పని దానిని ఏర్పాటుచేయకుండ ఆదేశాలిచ్చి సాయం చేయాలని మహిళలు వేడుకుంటున్నారు.ఈ విన్నపము జలదంకి మండలం కోదండరామపురం నారీమణులు ఉదయగిరి శాసనసభ్యుడు కాకర్ల సురేష్‌కు శుక్రవారం దండంపెట్టి విన్నవించుకున్నారు. వివరాలలోకి వెళితే గ్రామానికి కూతవేటుదూరంలో గత రెండు,మూడు రోజులనుంచి వైన్‌షాపు ఏర్పాటుచేయాలని కొందరు దాని యజమానులు ప్రయత్నాలు చేశారు.దానికి సంబందించి ఇప్పటికే భూయజమానితో మాట్లాడి ఒతాక్లీయర్‌చేసుకున్నారు.ఇక మిగిలిందంతా అతిత్వరలో షాపు ఏర్పాటేనట,ఆవిషయం గ్రామంలో అనోట,ఈ నోటపడి గ్రామంలో టాంటాంఅయి అందరిలో ఆందోళనమొదలైంది.వామ్మో మనం దానిని అడ్డుకోకుంటే చదువుకునే ఆడపిల్లల పరిస్తితి,మన కుటుంబాల స్థితిగతులు ఏంకావాలి అని కూడపలుక్కొని ఒక్కటయ్యారు.అందరు కలసి రోడ్‌మీదకు వచ్చారు.షాపు ఏర్పాటు చేయాలనుకున్న ప్రదేశానికి చేరుకున్నారు.మాగ్రామ సమీపంలో మద్యంషాపు విరమించుకోండి మాబ్రతుకుల్ని నాశనంచేయొద్దంటు నినదించారు.దీనిని మేం ఎట్టిపరిస్థితులలో ఒప్పుకోము నిన్నగాక మొన్న మాగ్రామ తలారులు ఇద్దరు మద్యంసేవించి రోడ్‌ప్రమాదంలో మృత్యువాత పడ్డారు.ఫలితంగ వారి కుటుంబాలు అలాకుపలాకయ్యాయని విచారం వ్యక్తంచేశారు.అంతేకాకుండ మాఆడబిడ్డలు చదువులకై ఈ రోడ్‌నే నడచివళ్ళాల్సి వుంది,మేము పొలాలకు వెళ్ళే మార్గంకూడా ఇదే కావున ఇక్కడమద్యంషాపు అంటేనే మావెన్నులో వణుకు కావున మాఆందోళనను దయచేసి అర్ధంచేసుకోండని అందరికి విజ్ఞప్తి చేశారు. సాయం చేయాలని అటు అదికారులు,ఇటు ప్రభుత్వ పెద్దలనుకూడా వేడుకున్నారు.విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని మహిళలతో మాట్లాడారు.ఏదైనావుంటే మాకు ఫిర్యాదు చేయండి తగు చర్యలు తీసుకుంటామని అన్నారు,అయినా వారు భీష్మించు కున్నారు.చివరకు సరేపదంటి స్టేషన్‌కే వచ్చి ఫిర్యాదు చేస్తామని కదిలారు.ఏమైనా మాకు న్యాయం జరగాలి మాకు ఎంఎల్ఏ వున్నాడు కాదుకూడదని షాపు ఏర్పాటుకు ప్రయత్నిస్తే మేమందరం కాకర్లన్నను స్వయంగ కలుస్తాం మాఆందోళనను వివరిస్తామని వారందరు ముక్తకంఠంతో అనడం విశేషం.

## వినియోగదారులకు మెరుగైన సేవలు అందించండి



**నెల్లూరు,జనవరి 3, ప్రభాతవార్త-వైద్యం** విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తూ సంస్థకి మంచి పేరు తీసుకురావాలని విద్యుత్ శాఖ జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ విజయన్ తెలిపారు. శుక్రవారం నగరంలోని విద్యుత్ భవన్‌లోని స్కాడా బిల్డింగ్‌లో విజయన్ నెల్లూరు టౌన్ డివిజన్, రూరల్ డివిజన్ అధికారులతో రివ్యూ సమావేశం నిర్వహించారు. విద్యుత్ దీపాలు డే టైంలో వెలుగుతూ ఉండకూడదు, వేలాడే విద్యుత్ తీగలు ఉండకూడదని, విద్యుత్ స్తంభాలకు క్రీపర్స్ అల్లుకుని ఉండకూడదు. ఈ మూడు విషయాలు ప్రతి ఒక్కరు పాటించాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్స్ ఫెయిల్యూర్స్ ఎక్కువగా ఉన్నాయని, ప్రతి ఒక్కఅధికారి ట్రాన్స్‌ఫార్మర్ ఎందుకు కాలిపోతుందో తనిఖీచేయాలని ఆయన ఆదేశించాడు. సంస్థకు వినియోగదారులు ఉపయోగించిన విద్యుత్‌కు ఖచ్చితమైన బిల్లింగ్‌కు చేసి వినియోగదారునికి బిల్లు ఇవ్వడం మొదటి కర్తవ్యం కావున ప్రతి అధికారి బిల్లింగ్ ప్రక్రియ ప్రతి నెల 9వ తేదీ లోపల పూర్తి చేయాలని సూచించాడు. విద్యుత్‌కు సంబంధించి ఏ సేవలకైన వినియోగదారులు వాట్సప్ నెంబర్ 9133331912 కు వాట్సప్ చేయవచ్చుని తెలిపారు. వినియోగదారులందరూ ఈ నెంబర్‌ను నోట్ చేసుకోవాలని తెలిపారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ప్రతి అధికారి వారి జ్యూరీ డక్షన్‌లో వినియోగదారులకు అవగాహనకల్పించాలని సూచించారు. వినియోగదారులకు సత్వర సేవలందించడంపై క్షేత్రస్థాయిలో ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. విధులు నిర్వహణలో అలసత్వం చేయవద్దని తెలిపారు. వినియోగదారులను ఆఫీస్‌ల చుట్టు పదేపదే తిప్పుకోవద్దని వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలిపారు. ప్రతి సర్వీస్ ఖచ్చితమైన రీడింగ్ ఐఆర్డీఏ స్కానింగ్ ద్వారా బిల్లింగ్ చేసి వినియోగదారునికి ఇవ్వాలని తెలిపారు. డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్స్ ప్రతి నెల ఆ నెలలో మంజూరు చేసిన ఇండస్ట్రీయల్ సర్వీసులు, కేటగిరి-2 సర్వీసెస్‌కు చెక్ రీడింగ్ తీయాలని, అసిస్టెంట్ ఇంజనీర్స్ ప్రతి నెల మంజూరు చేసి గృహ సర్వీసెస్ రీడింగ్స్ తీయాలని, లైన్ ఇన్‌స్పెక్టర్‌లు సక్రమంగా మూడు నెలలు విద్యుత్ వాడకం లేని సర్వీసెస్, డిస్ కనెక్షన్ చేసిన సర్వీసుల చెక్ రడింగ్ తీయాలని ఆదేశించాడు. వేసవి కాలానికి నిరంతర మెరుగైన విద్యుత్‌కు యాక్షన్ ప్లాన్ రెడీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ పి.మురళి, ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ నెల్లూరు రూరల్ ఏ.సోమశేఖర్‌రెడ్డి, ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ టౌన్ ఎం.శ్రీధర్, డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్స్ ఆకురాతి అశోక్, సునీల్, కిరణ్, రాము, భాను నాయక్, సురేష్, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్స్ బొబ్బిలి సురేఖ, ఆశాలత, సుబ్బారావు, ఏడుకొండలు, అసిస్టెంట్ ఇంజనీర్స్, జూనియర్ ఇంజనీర్స్ పాల్గొన్నారు.

## సావిత్రిబాయి విగ్రహానికి పూలమాల వేసిన మస్తాన్‌రావు



**నెల్లూరు,జనవరి 3, ప్రభాతవార్త- వైద్యం** నగరంలోని మినీ బైపాస్ రోడ్డులో మహాత్మ జ్యోతి రావుపూలే సావిత్రిబాయి పూలే దంపతులకు తెలుగుదేశం పార్టీ రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు సావిత్రి బాయి పూలే జయంతి సందర్భంగా వారి విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని తొలి మహిళా ఉపాధ్యాయు రాలుగా ఆమె చేసిన సేవలు ఎనలేనివని మస్తాన్‌రావు కొనియాడారు. రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావుతో కలిసి పాల్గొన్న ఏపీఎన్‌జీజీటిస్ జిల్లా అధ్యక్షులు మన్నేపల్లి పెంచలరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారుపల్లి వెంకటేశ్వర్లు, కార్యదర్శి గాదిరాజు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడల్లో రాణించేలా ప్రోత్సహించాలి



**నెల్లూరు, జనవరి 3, ప్రభాతవార్త-వైద్యం** దివ్యాంగ పిల్లలకు కావాల్సిన పునరావస్తు చికిత్సలే కాకుండా క్రీడల్లో, కల్చరల్, యాక్టివిటీస్‌లో వారికి ప్రోత్సాహన్ని అందించాలని తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి మాజీ ఎమ్మెల్సీ సర్వేపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం నగరంలోని ప్రోత్సా సంయుక్త ప్రాంతాయ కేంద్రం సీఆంసీలో తొమ్మిదో వార్షికోత్సవ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, శ్రీనివాసరావు, ప్లాంట్ హెడ్ జిందాల్, పవర్ లిమిటెడ్ సింహపురి యూనిట్, అతిథులుగా వెంకట సుబ్బయ్య, అడిషనల్ ప్రాజెక్టు ఆఫీసర్ ఎస్ఎస్ఏ నెల్లూరు, శ్రీ సిద్ద నాయక్ మెడికల్ సూపరింటెండెంట్ స్వప్నశ్రీ, హెచ్‌డీ డ్రీం ఫౌండేషన్, మస్తాన్, వైస్ ప్రిన్సిపాల్ ఏఎస్ఆర్ మెడికల్ కాలేజీ శిరీషకేర్ ఇండియా కోఆర్డినేటర్‌లు విచ్చేశారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ 9వ ఆనివర్సరీలో భాగంగా సీఆర్సీ నెల్లూరులో ఈ రోజు గత నెల డిసెంబర్ జనవరి 19,20వ తేదీల్లో జరిగిన పారా ఒలంపిక్ స్పోర్ట్స్ విజేతలకు బహుమతులు ప్రధానం ఇవ్వడం అనేది చాలా ంతోషం కలిగిందన్నారు. అలాగే ఈ యొక్క కేంద్రం ఇక్కడ ఏర్పడడానికి అనగానికి కారణం పెద్దాయన మాజీ ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడని వారి యొక్క దూరదృష్టి, విలక్షణ ఆలోచన శైలి వల్లనే ఈ మండలంలో ఐదు సెంటర్ గవర్నమెంట్ ఇనిస్టిట్యూషన్స్ ఇక్కడ ఏర్పాటు చేయడం జరిగిందని, సీఆర్సీలో ఉన్నటువంటి ప్రొఫెషనల్ వల్ల మన ప్రాంతపు దివ్యాంగులు అనేకమైనటువంటి రిహబిలిటేషన్ సర్వీసెస్ పొందగలుగుతున్నారని వారి యొక్క సేవలకు ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే ఈ కార్యక్రమానికి సంబంధించిన విజేతలకు బహుమతులు ఈ ఒలంపిక్స్ క్రీడలను నిర్వహించినటువంటి జిందాల్ ప్లాంట్ వారిని ఆయన అభినందించారు. ఈకార్యక్రమంలో భాగంగా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి క్యూర్ ఇండియా వారి సర్వీస్ సెంటర్‌ను సీఆర్‌సీలో ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సీఆర్సీ యొక్క సిబ్బంది, బెనిఫిషరీస్ తల్లిదండ్రులు, ఎస్ఎస్సీ, ఇతర ఎన్జీవోస్ నుంచి పెద్ద ఎత్తున దివ్యాంగులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకి శుభాకాంక్షలు తెలియజేసిన ఆటో నగర్ యూనియన్ నాయకులు



**వింజమూరు,జనవరి 3, ప్రభాతవార్త** ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ను వింజమూరు ఆటో మొబైల్ డీలర్స్ టెక్నికల్ వర్క్స అసోసియేషన్ అధ్య క్షులు అంకినపల్లి రఘురా మిరెడ్డి, సెక్రటరీ గువ్వల రవీంద్రారెడ్డి, కార్యదర్శులు కదిరి రంగారావు, మహేంద్ర, ట్రెజరీ బ్రహ్మయ్య తదితరులు తెలుగుదేశం ప్రధాన పార్టీ కార్యాలయం నందు కలిసి పుష్పగుచ్చం అందజేసి శాలువాతో సన్మానించి స్వీటును అందించి ఆంగ్ల నూతన సంవత్సరశుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వింజమూరు పట్టణానికి ఆటో నగర్ అవసరమని ఆటోనగర్ ఏర్పాటుకు కృషి చేస్తానని తెలియజేశారు. ఇప్పటికే ఈవిషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లాలనితెలిపారు. ఇచ్చిన మాటకు కట్టుబడి త్వరలో ఆటోనగర్ ఏర్పాటు చేస్తానన్నారు.

## సంగం సొసైటీని పరిశీలించిన జిల్లా సహకారం సంఘం డిసిఓ



**సంగం జనవరి 3 ప్రభాతవార్త** సంగం సొసైటిని జిల్లా సహకార సంఘం డిసిఓ గురప్ప పరిశీలించారు. సొసైటీలో ఎరువుల అమ్మకాలు, స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెట్రోల్ బంకును కూడా ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందికి పలు సూచనలు ఇచ్చిరు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూడాలని అన్నారు.

## జడ్‌పీలో పీఆర్ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



**నెల్లూరు కలెక్టరేట్, జనవరి 3, ప్రభాతవార్త** శుక్రవారం నూతన జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయతీరాజ్ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం నెల్లూరు జిల్లా వారి క్యాలెండర్ .చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ, సీఈఓఎం .విద్యారమ, ఉపముఖ్య కారణాధికారి జె.మోహన్ రావు చేతుల మీదుగా పంచాయతీరాజ్ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం నెల్లూరు జిల్లా వారి క్యాలెండర్ ఆవిష్కరించడం జరిగింది ఈ కార్యక్రమంలో నాలుగో తరగతి అసోసియేషన్ అధ్యక్షులు కే భీమిరెడ్డి జిల్లా కార్యదర్శి షేక్ మా భాష ,కార్యవర్గ సభ్యులు మిస్టర్ ఎంప్లాయిస్ జిల్లా అధ్యక్షులు పెంచలయ్య కార్యాలయ పరిపాలన అధికారులు కొండయ్య రవి కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జాయింట్ కలెక్టర్‌తో సీమాంధ్ర ఎంఆర్పిఎస్ నేతలు భేటీ



**నెల్లూరు కలెక్టరేట్, జనవరి 3, ప్రభాతవార్త** నెల్లూరు జిల్లా జాయింట్ కలెక్టర్ కార్తీక్‌తో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు పందిటి సుబ్బయ్య, మన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు పల్లాల శ్రీనివాసులు ఇతర నేతలు మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మాదిగలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను వారి దృష్టికి తీసుకుని వెళ్లారు. నందిపాటి దాచేలు, దీపుబాబు, పలిగేలచిన్నయ్య, కాకులూరి సీనయ్య, పాదర్తి రమేష్, నాగార్జున, గంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

## రాజీవ్ రంజాన్ మిశ్రాకు పుష్పగుచ్చం అందజేసి ఘన స్వాగతం పలికిన నెల్లూరు ఆర్డీవో అనూష



**నెల్లూరు కలెక్టరేట్, జనవరి 3, ప్రభాతవార్త** నెల్లూరు ఆర్అండ్ బిఅతిథి గృహానికి చేరుకున్న వన్ మాన్ కమిషన్ చైర్మన్ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజాన్ మిశ్రాకు పుష్పగుచ్ఛాలు అందజేసి ఘన స్వాగతం పలికారు. నెల్లూరు ఆర్డీవో అనూష, షెడ్యూల్డ్ కులాల ఉపవర్గీకరణకు సంబంధించి ఎస్సీ పౌరులు,సంఘాల నుంచిరేపు (శనివారం)ఉదయం కలెక్టరేట్లో విజ్ఞప్తులు స్వీకరించనున్నారు.

## అమృతపథకం పనులను పర్యవేక్షించిన మున్సిపల్ కమిషనర్



**కావలి, జనవరి3 ప్రభాతవార్త** కావలి పురపాలకసంఘం పరిధిలో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ వద్ద జరుగుతున్న అమృతపథకం పనులను శుక్రవారం కావలి మున్సిపల్ కమీషనర్ శ్రావణ్‌కుమార్ పర్యవేక్షించారు. బుడమగుంట, ఇందిరమ్మ కాలనీవాసుల త్రాగునీటి సమస్యలకు సంబంధించి పలువురుతో మాటాడారు. యుద్ధప్రాతిపదికన త్రాగునీటి సమస్యలు పరిష్కరించాలని, ఇంజనీరింగ్ విభాగంవారిని కమీషనర్ శ్రావణ్‌కుమార్ ఆదేశించారు. రానున్న వేసవి దృష్ట్యా కావలి పురపాలకసంఘం పరిధిలో ప్రజలకు త్రాగునీరు సమస్య తలెత్తకుండా చూడాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.

## నేతాజీ పైలెట్ పాఠశాలలో ప్రారంభమైన ఎన్‌సిసి యూనిట్



**నెల్లూరు,జనవరి3 ప్రభాతవార్త-విద్య** నగరంలోని స్దానిక శ్రీనివాస నగర్ లోని శ్రీ నేతాజీ ఎమ్మెసార్ పైలెట్ హైస్కూల్‌లో నావెల్ ఎన్‌సికికి సంబందించిన యూనిట్‌ను కమాండింగ్ అధికారి గనేష్ గోదంగనే ప్రారంబించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధులుగా ఎంవి.నేతాజీ సుబ్బారెడ్డి, డాక్టర్ సుబ్రామ్, సాగర్ ముకుంద్, నరేంద్రరెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేతాజీ సుబ్బారెడ్డి మాట్లాడుతు తమ పాఠశాలలో 10వ నావెల్‌యూనిట్‌ను ప్రారంబించటం సంతోషంగా ఉదన్నారు. ప్రకృతి వైపరిత్యాలు, అనుకోని సంఘటనలు జరిగినప్పుడు ఎన్‌సిసి చేస్తున్న సేవలు స్పూర్తిదాయకమన్నారు. విద్యార్దులు ఈ అవకాశాన్ని సద్వినియోగంచేసుకోవాని సూచించారు. ఈకార్యక్రమంమలో డైరెక్టర్ అలేఖ్యరెడ్డి, ప్రిన్సిపాల్ సుధ, సిబ్బంది స్పందన, నరసింహారావు, చెంచయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రిని సన్మానించిన ఏపీటీఎస్‌ఏ నేతలు





**కోవూరు, జనవరి 3 ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను నూతన సంవత్సరం సందర్భంగా విజయవాడలో ఏపీటీఎస్ఏ ఆధ్వర్యంలో కలిసి శాలువా, బొకేతో ఘనంగా సత్కరించి అనంతరం ఏపీటీఎస్ఏ క్యాలెండర్‌ను ఆవిష్కరించుకున్నారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శులు పియూష్‌కుమార్, ఎం.జానకి, రునాల్డ్ రాస్, డైరెక్టర్ మోహన్‌రావు, జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసనాయక్‌లను కలిసి నూతన శుభాకాంక్షలు తెలియజేశారు. తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు పి. శ్రీనివాసరావు,ఏపీటీఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు శోభన్ బాబు, ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడు పి. కిరణ్‌కు మార్, వీరితో పాటు సబ్ ట్రెజరీ అధికారులు రోహిత్, రెహమాన్, నరేంద్ర, కొండలరావు, తదితరులు ఉన్నారు.

## వైసీపీ పాలనలో ఆరోగ్య శాఖ అనారోగ్య శాఖగా మారింది



**కోవూరు, జనవరి 3 ప్రభాతవార్త :** గత వైసీపీ పాలనలో ఆరోగ్య శాఖ అనారోగ్య శాఖగా మారి ప్ర భుత్వ వైద్యం పూర్తిగా ప్రజలకు దూరమైందని జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లురెడ్డి అన్నారు. కోవూరులోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం మారి ఏడు నెలలు కావస్తున్నా ప్రభుత్వ వైద్యులు , సిబ్బంది పనితీరులో ఆశించిన మేర మార్పు రాలేదన్నారు. కొంతమంది వైద్యు లు బాగా చేస్తున్నప్పటికీ ఎక్కువ మంది ఆశించిన మేర పనిచేయడం లేద న్నారు. ఉదయం 9 గంటలకు వచ్చి వేలిముద్ర వేసి కాసేపు ఉండి వెళ్లిపోయి మరలా 4 గంటలకు వచ్చి వేలిముద్ర వేస్తున్నారన్నారు. కొన్ని ప్రభుత్వ ఆసు పత్రిల్లో జనన మరణ ధృవీకరణ పత్రాలకు పేదల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆస్పత్రులను ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి, జిల్లా కలెక్టర్లు ప్రభుత్వ ఆస్పత్రుల్లో తనిఖీలు చేస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు. ప్రభుత్వ వైద్య సేవల్లో ఉన్న లోపాలను గుర్తించి పేదలకు మంచి వైద్యం అందించాలని కూటమి ప్రభుత్వం కృషి చేస్తున్నప్పటికీ కొంతమంది వైద్యులు పనితీరు వలన అది సాధ్యం కావడం లేదన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులపై రోగుల్లో విశ్వాసం పెరగాలన్నా అక్కడ జరుగుతున్న లోపాలను అదిగమించాలన్నా జిల్లా కలెక్టర్లు, డీఎంహెచ్‌వోలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం వేల కోట్లు ఖర్చు చేస్తున్నప్పటికీ కొంతమంది వైద్యుల వ్యవహార శైలి వలన రోగులు తమకు శక్తి లేనప్పటికీ ప్రైవేట్ ఆస్పత్రులకే వెళ్తున్నారన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రత్యేక దృష్టి సారించి పేద ప్రజలకు సరైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్నారు.

## వంద రోజుల ప్రణాళికపై ప్రత్యేక దృష్టి



**కోవూరు, జనవరి 3 ప్రభాతవార్త** : రానున్న వంద రోజుల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ లో చేయవలసిన కార్యక్రమాలపై శుక్రవారం తన కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పొలంరెడ్డి దినేష్‌రెడ్డి ప్రత్యేకంగా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచనలతో ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఆధ్వర్యంలో రానున్న వంద రోజుల్లో తమ కార్పొరేషన్ ద్వారా చేపట్టాల్సిన కార్యక్రమాలను గురించి చర్చించి ఒక ప్రత్యేక ప్రణాళికలను రూపొందించడం జరిగిందని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు.

## రాష్ట్రస్దాయి పోటీలకు ఎంపికైన నమూనాలు -విజేతలకు సర్టిఫికేట్స్ బహూకరణ



**నెల్లూరు,జనవరి3 ప్రభాతవార్త-విద్య** శుక్రవారం నగరంలోని స్దానిక స్టోన్ హౌస్‌పేటలోని ఆర్ఎస్ఆర్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్దాయి వైజ్ఞానిక ప్రదర్శనను నిర్వహించారు. ఇందులో జిల్లాలోని 38 మండలాల నుండి సుమారు 114 నమూనాలను ప్రదర్శనలో ఉంచగా ఉత్తమంగా నిలిచిన 6 నమూనాలను విజేతలుగా ప్రకటించి రాష్ట్ర స్దాయి పోటీలకు ఎంపిక చేశారు. రాష్ట్రస్దాయి పోటీలకు ఎంపికైన నమూనాల్లో ఇందుకూరుపేట మండలం కొమరిక జెడ్పీహెచ్ఎస్ కు చెందిన విద్యార్ధి షన్ముక్ అంధుల కోసం తయారు చేసిన కళ్ళజోడు, రాపూరు మండలం కండలేరు ఎపిఎస్‌డబ్ల్యూఆర్ఎస్ కు చెందిన విద్యార్ధి చైత్ర కృష్ణ నమూనా ప్రొక్షణ్‌డిస్క్, వెంకటాచలం మండలం, గోలగమూడికి చెందిన ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్దులు కరీష్మ, దీక్షల నమూనా హిల్ స్టేషన్స్ యూటర్న్ ప్రమాదాల నివారణ , తొటపల్లి గూడూరు మండలం కోడూరు బిఆర్ అంబేద్కర్ కురుకుల విద్యార్దులు బి.కీర్తి, రాజశ్రీల నమూనా అపిల్ కేషన్ ఆఫ్ ట్రెగినామేటరీ ఇన్ రియల్‌లైఫ్, వెంకటాచలం మండలం, గోలగమూడికి చెందిన ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన అద్యాపకులు ఇ.అమరావతి ప్రదర్శించిన వాననీటి సెన్సార్, ఉలవపాడు మండలం ఎపిఎమ్మెస్ వీరేపల్లి పాఠశాలకు చెందిన అద్యాపకులు బిందుమాదవి ప్రదర్శించిన సీ చేంజ్ కర్వ్‌లు రాష్ట్ర స్దాయి పోటీలకు ఎంపికైన వాటిలోఉన్నాయి. కాగా విజేతలకు శుక్రవారం రాత్రి బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లావిద్యాశాఖ అధికారి బాలాజీరావు పాల్గొని విజేతలకు సర్టిఫికేట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి కరుణాకర్‌రెడ్డి, అద్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వాన్ని చాటుకున్న చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా



**బుచ్చి జనవరి 3 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం నగర పంచా యితీలోని కట్టుబడి పాళెంలో గత కొన్ని నెలలగా అనారో గ్యంతో వున్న కలూరు శ్రీని వా సులు అనే వ్యక్తి మృతి చెం దాడు. అంత్యక్రియలు చేయడానికి కూడా చేతిలో చిల్లి గవ్వ లేని దీన స్దితి ఆకుటుంబానిది. ఒకటో వార్డు కౌన్సిలర్ కత్తినాగరాజు, స్దానిక టి డిపి నాయకులు తిరువాయిపాటి ప్రసాద్ ద్వారా మృతుడు శ్రీనివాసులు కుటుంబానికి 5 వేల రూపాయాలు అందజేశారు. ఈనగదు శ్రీనివాసులు అంత్యక్రియలకు ఉపయోగించాలని ఆమె సూచించారు.

## శ్రీమల్లికార్జునస్వామి కామాక్షితాయిని దర్శించుకున్న శ్రీకరుణామయి శ్రీ విజయేశ్వరీదేవి



**బుచ్చి జనవరి 3 ప్రభాతవార్త** పవిత్రపుణ్యక్షేత్రమైన జొన్నవాడలోని శ్రీమల్లికార్జునస్వామి,కామాక్షితాయిని పెంచల కోనలోని శ్రీమాతృదేవి విశ్వశాంతి ఆశ్రమం శ్రీకరుణామయి శ్రీవిజయేశ్వరదేవి దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి,అర్చకులు, అమ్మకు ఘనంగా స్వాగతం పలికారు. శ్రీలక్ష్మీగణపతి స్వామి వారికి, శ్రీమల్లికార్జున స్వామి వారికి, శ్రీవల్లిదేవసేన,శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి, శ్రీకామాక్షితాయి అమ్మవారి దర్శినం చేసుకున్నారు. అర్చకులు ప్రత్యేకంగా పూజలు నిర్వహించి అతిధులను శేషవస్త్రాలతో సత్కరించారు. వేద ఆశీర్వచనం ,తీర్ద ప్రసాదాలు అందించారు. కరుణామయిఅమ్మతోపాటు సుమారు 50 మంది విదేశిభక్తులున్నారు.

## మంత్రి సమక్షంలో శాశ్విత టిడిపి సభ్యత్వం తీసుకున్న ఆనం,సూరా



**సంగం జనవరి 3 ప్రభాతవార్త** సంగం మండలం అన్నారెడ్డిపాళెం నీటి సంఘం అధ్యక్షులు సూరా శ్రీనివాసులురెడ్డి,వెంగారెడ్డిపాళెం సర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డి దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సమక్షంలో టిడిపి శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. ఒక్కోక్క సభ్యత్వానికి లక్ష రూపాయాలు కట్టి వారు సభ్యత్వం తీసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి వారిని అభినందించారు.

## ఎమ్మెల్యే సహకారంతో జాయింట్ కలెక్టర్‌ని కలిసిన కార్మికనేతలు



**నెల్లూరు కలెక్టరేట్, జనవరి 3, ప్రభాతవార్త** కోవూరు శాసన సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చొరవతో బుచ్చిరెడ్డిపాళెం ఆటోనగర్ కార్మికులు శుక్రవారం జాయింట్ కలెక్టర్‌ని కలిశారు. బుచ్చిరెడ్డిపాళెం మెకానికల్ టెక్నిషియన్స్ వెల్ఫేర్ అసోసి యేషన్ అధ్యక్షులు యజ్ఞానిభాషా నేతృత్వంలో ఆటో కార్మికులు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి తమ సమస్యల గురించి వివరించారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే జాయింట్ కలెక్టర్‌కి, ఎపిఐఐసి జీఎంకి బుచ్చిరెడ్డి పాళెం ఆటోనగర్ (పారిశ్రామికవాడ)కు లేక వ్రాశారు .వెంటనే వారు స్పందించడం జరిగిందని యజ్ఞానిభాషా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఆటో నగర్ కార్మికులు తరపున ఆయన ప్రత్యేకంగా దన్యవాదాలు తెలిపారు. 2013 నుండి ఇప్పటి వరకు అలుపెరగని పోరాటం చేస్తున్నామని చెప్పారు. కోవూరు శాసన సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆటో నగర్ నిర్మాణం కోసం అడిగిన వెంటనే స్పందించడం అభినందనీయమని అన్నారు. అలాగే ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి ఆటో కార్మికులు రుణపడి ఉంటారని అన్నారు. బుచ్చిరెడ్డిపాళెం మండలంలో మొత్తం 2 వందల కుటుంబాలు ఆటో కార్మిక రంగంపై ఆధారపడి జీవిస్తున్నారని చెప్పారు. నాగమాంబాపురం పంచాయితీ పరిధిలోని కొట్టాల వద్ద ఆటో నగర్ ఏర్పాటు చేసేందుకు ఎమ్మెల్యే,జాయింట్ కలెక్టర్,ఎపిఐఐసిజిఎం చేస్తున్న సహాయానికి ఆటో కార్మికులు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

## ఘనంగా సావిత్రిబాయిపూలే జయంతి

### - ముఖ్య అతిథిగా చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా




**బుచ్చి జనవరి 3 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం నగరపాలక పంచాయిలోని రెయిన్‌బో స్కూల్‌లో సావిత్రిబాయి పూలే జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం పాఠశాల డైరెక్టర్ టి.చిట్టిబాబు నేతృత్వంలో నిర్వహించారు .కార్యక్ర మానికిక ముఖ్య అతిథిగా చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా పాల్గోన్నారు. ఈ సందర్భంగా సాయిత్రి బాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మహిళా ఉపాధ్యాయురాళ్ళను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మాట్లాడుతు గొప్ప సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే అని ఆమె కొనియాడారు. స్త్రీలు బయటకు రావాలంటే బయపడే రోజులలో స్త్రీలకు విద్యనేర్పించిన మొదటి మహిళా టీచర్ జ్యోతిరావు పూలే అని ఆమె కొనియా డారు. అలాంటి మహనీయురాలి వల్లనే నేడు స్త్రీలు విద్యనభ్యసిస్తు ఉన్నత శిఖరాలు అదిరోహించారని అన్నారు. ఈకార్యక్రమంలో పిడి భీమతాటి వెంకటరమణ య్య, మదిరి శ్రీనివాసులు,ఉపాధ్యాయురాళ్ళు పాల్గోన్నారు.

## హైదరాబాదులో తెలుగు సమాఖ్య మహాసభలకు హాజరైన ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి





**కోవూరు, జనవరి 3 ప్రభాతవార్త** హైద రాబాద్ హెచ్ఐ సీసీలో ప్రపంచ తెలుగు సమా ఖ్య మహాసభలకు హాజ రైన సీఎం చంద్రబాబు నాయుడు నారా భువనేశ్వరి , కోవూరు ఎమ్మె ల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి తదితరులు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించిన సీఎం చంద్రబాబు